జ్ఞాని పురుష్ దాదా భగవాన్ నిర్వచించిన

అంతఃకరణ స్వరూపం



జ్ఞాని పురుష్ దాదాశ్రీ (దాదా భగవాన్)

Telugu

జ్ఞాని పురుష్ దాదా భగవాన్ నిర్వచించిన

అంతఃకరణ స్వరూపం

మూల గుజరాతి సంకలనం - డా.నీరు బెహన్ అమీన్

తెలుగు అనువాదం - మహాత్మగణం

ప్రకాశకులు : అజీత్ సి.పటేల్
దాదా భగవాన్ విజ్ఞాన్ ఫౌండేషన్
1, వరుణ్ అపార్ట్‌మెంట్, 37,శ్రీమాలి సొసైటీ
నవరంగ్‌పురా పోలీస్ స్టేషన్ ఎదురుగా,
నవరంగ్‌పురా, అహ్మదాబాద్ – 380009
గుజరాత్, భారత్
ఫోన్: + 91 79 3500 2100

First Edition : June 2024 (500 copies)

భావ మూల్యం : 'పరమ వినయం', మరియు "నాకు
ఎంతమాత్రం తెలియదు. అదే భావన

Price : Rs. 35

ముద్రిక : అంబా మల్టి ప్రింటింగ్
B–99, ఈల్కెట్రానిక్స్ GIDC
క–6, రోడ్డు సెక్టర్–25
గాంధీనగర్ – 382044
గుజరాత్, India
ఫోన్: +91 79 3500 2142

ISBN/eISBN : 978-93-91375-66-9

Printed in India

త్రిమంత్రం

(సర్వ విఘ్న నివారణ చేసే మంత్రం)



నమో అరిహంతాణం

నమో సిద్ధాణం

నమో ఆయరియాణం

నమో ఉవజ్ఝాయాణం

నమో లోయే సవ్వ సాహూణం

ఏసోపంచణమోక్కారో,

సవ్వాపావప్పణాసణో

మంగళా ణం చ సవ్వేసిం,

పడమం హవయీ మంగళం

ఓం నమో భగవతే వాసుదేవాయ

ఓం నమో శివాయ

జై సచ్చిదానంద







దాదా భగవాన్ ఎవరు?

అది జూన్ 1958 లో ఒక సాయంత్రం సమయం సుమారు 6:00, ప్రదేశం రద్దీగా ఉన్న సూరత్ పట్టణ రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫార్మ్ నం.3.లో బెంచీ మీద కూర్చునివున్న శ్రీ అంబాలాల్ మూల్జీ భాయ్ పటేల్ అనే దేహమందిరంలో, ప్రకృతిపరంగా, అక్రమ రూపంలో, ఎన్నో జన్మలుగా వ్యక్తమయ్యేందుకు ఆత్రుతగా ఎదురుచూస్తున్న 'దాదా భగవాన్' పూర్ణ రూపంలో ప్రకటితమయ్యారు, ఆధ్యాత్మిక అద్భుతంలా. ఒక గంట సమయంలోనే ఆయనకు విశ్వ దర్శనం అయింది. "నేనెవరు? భగవంతుడు ఎవరు? విశ్వాన్నంతా ఎవరు నడిపిస్తున్నారు? కర్మ అంటే ఏమిటి? ముక్తి అంటే ఏమిటి?" ఇలాంటి ప్రపంచంలో ఆధ్యాత్మిక ప్రశ్నలన్నిటికీ సమాధానం వచ్చింది. ఈ విధంగా దైవం, విశ్వానికి సంబంధించిన ఒక అద్వితీయమైన పూర్ణ స్వరూప దర్శనం కావించింది, దాని ఫలస్వరూపమే శ్రీ అంబాలాల్ మూల్జీ భాయ్ పటేల్, గుజరాత్‌లోని చరోతర్ క్షేత్రంలోని భాదరణ్ గ్రామంలో పాటీదార్, ఒక కాంట్రాక్ట్ పని చేసే వ్యక్తి, అయినా కూడా సంపూర్ణ వీతరాగ పురుషుడు.

"వ్యాపారంలో ధర్మం పాటించాలి కాని, ధర్మాచరణలో వ్యాపారం చేయగూడదు" అనే సిద్ధాంతంతోనే ఆయన జీవితమంతా గడిపారు. ఆయన ఎప్పుడూ ఎవరి దగ్గరి నుంచీ డబ్బు తీసుకోలేదు సరికదా తన ఆదాయం నుంచే తీర్థయాత్రలు చేసే భక్తులకు ఆర్థిక సహాయం చేసారు.

ఆ విధంగా ఆయనకు కేవలం రెండు గంటలలోనే సిద్ధించిన అద్భుతమైన జ్ఞానాన్ని ఉపయోగించి, ఆయన ఎందరో ముముక్షువులకు ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించారు. దాన్ని ఆయన అక్రమ మార్గం అని అన్నారు. అక్రమ అంటే ఒక క్రమం లేని అర్థం. క్రమం అంటే ఒక మెట్టు పైన మరో మెట్టుని క్రమంగా ఎక్కుతూ వెళ్ళటం. అక్రమ మార్గమంటే షార్ట్‌కట్‌లో లిఫ్ట్ ద్వారా పైకి చేరుకోవటం.

ఆయన “దాదా భగవాన్ ఎవరు” అన్న రహస్యాన్ని స్వయంగా చెప్తూ, “మీ ముందు కనిపిస్తున్న ఈ ఆకారం దాదా భగవాన్ కాదు. ఈయన ఎ.ఎమ్.పటేల్. మేము ఒక జ్ఞానపురుషుడను, లోపల ప్రకటితమైనది దాదా భగవాన్. దాదా భగవాన్, 14 లోకాలకు నాథుడు. ఆయన మీలో కూడా ఉన్నాడు. అందరిలోనూ ఉన్నాడు. మీలో అవ్యక్త రూపంలో ఉన్నాడు, నాలో సంపూర్ణ రూపంలో వ్యక్తమై ఉన్నాడు. ఆ దాదా భగవాన్ గారికి నేను కూడా ప్రణామం చేస్తాను”.

నివేదన

ఆత్మవాణి ముఖ్యమైన గ్రంథం. అది దాదా భగవాన్ శ్రీముఖం నుంచి వెలువడిన వాణి, ఒరిజినల్ వాణి నుంచి తయారుచేసింది. పాఠకులకు చదవటంలో సౌకర్యం కలిగించేందుకు ఆ గ్రంథాన్ని ఆరు భాగాలుగా విభజించటం జరిగింది.

1. జ్ఞాని పురుష్ గుర్తింపు.
2. జగత్తుకి కర్త ఎవరు?
3. కర్మ సిద్ధాంతం.
4. అంతఃకరణ స్వరూపం.
5. సర్వ దుఃఖాల నుంచి విముక్తి.
6. ఆత్మబోధ

పరమ పూజ్య దాదాశ్రీ హిందీలో తక్కువగా మాట్లాడేవారు. ఎప్పుడైనా హిందీ భాషవాళ్ళు వచ్చినప్పుడు, వాళ్ళకి గుజరాతీ అర్థం కానప్పుడు, వాళ్ళ కోసం పరమ పూజ్య దాదాశ్రీ హిందీలో మాట్లాడేవారు. ఆ వాణిని కేసట్ల లోంచి ట్రాన్స్క్రైబ్ చేసి ఈ ఆత్మవాణి గ్రంథాన్ని తయారుచేయటం జరిగింది. అదే ఆత్మవాణి గ్రంథాన్ని తిరిగి సంకలనం చేసి ఈ చిన్న పుస్తకాలను తయారుచేయటం జరిగింది. ఆయన హిందీ 'ప్యూర్' హిందీ కాదు. అయినప్పటికీ వినేవాళ్ళకి ఆయన ఏం చెప్పాలని లోపల అనుకున్నారో అది 'ఎగ్జాక్ట్' గా అర్థమయ్యేది. ఆయన వాణి హృదయ స్పర్శీ, హృదయ భేది అవటం వలన, ఎలా అయితే బహిర్గతమైందో అలాగే సంకలనం చేసి అందించటం జరుగుతూవుంది. ఎందుకంటే, దానివలన సుజ్ఞ పాఠకులకు ఆయన 'డైరెక్ట్' మాటలు చేరవేయటం జరుగుతుంది. ఆయన హిందీ, గుజరాతీ ఆంగ్లాల మిశ్రమం. అయినా, వినటానికి, చదవటానికి ఎంతో తియ్యగా ఉంటుంది. నేచురల్‌గా ఉంటుంది. సజీవంగా అనిపిస్తుంది. ఇందులో ఉపయోగించిన పదాలు భాషాపరంగా చాల సాదాసీదాగా ఉంటాయి కాని, 'జ్ఞాని పురుష్' దర్శనం నిరావరణమైనది. అందువలన ఆయన ప్రతి మాట, ఒక ఉద్దేశ్యంతో, మార్మికంగా, మౌలికంగా, ఎదుటివారి వ్యూపాయింట్‌ని ఎగ్జాక్ట్‌గా అర్థం చేసుకుని చెప్పివున్న కారణంగా, ఇది శ్రోత దర్శనాన్ని సుస్పష్టంగా తెరచిచూపిస్తుంది, వాళ్ళని పై స్థాయిలకు తీసుకునివెళ్తుంది.

–డా. నీరూ బెహన్ అమీన్

సంపాదకీయం

కేవలం ఒక జ్ఞాని పురుష్ మాత్రమే తన అంత:కరణం నుండి పూర్తిగా విడిగా ఉండగలుగుతారు. ఆత్మలోనే ఉంటూ దాని యదార్థ వర్ణన చేయగలుగుతారు. జ్ఞాని పురుష్ పరమ పూజ్య దాదా భగవాన్ (దాదాశ్రీ) అంత:కరణ వర్ణనను ఎంతో సుందరంగా, స్పష్టంగా చేసారు.

అంత:కరణంలో నాలుగు భాగాలున్నాయి. మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం. ప్రతిదాని పని వేరువేరు. ఒక సమయంలో వాటిలో ఏదో ఒకటే కార్యాన్వితమై వుంటుంది.

మైండ్ అంటే ఏమిటి? మనో గ్రంథులతో తయారైంది. పోయిన జన్మలో అజ్ఞానంతో చేసిన రాగద్వేషాల పరిణామాన్ని వెలికితీసి, వాటి సంగ్రహంతో తయారైన గ్రంథి. ఈ గ్రంథి ఈ జన్మలో పగులుతుంది. అప్పుడు దాన్ని ఆలోచన అంటారు. ఆలోచనని డిశ్చార్జ్ అవుతున్న మనస్సు అంటారు. ఆలోచన వస్తుంది, ఆ సమయంలో అహంకారం దానితో తన్మయాకారమౌతుంది. అదేగనక తన్మయాకారం కాకపోతే, డిశ్చార్జ్ అయిపోయి మనస్సు ఖాళీ అయిపోతుంది. ఎవరికి ఎంత ఎక్కువ ఆలోచనలు ఉంటే వారికి అంత పెద్ద మనోగ్రంథి ఉంటుంది.

అంత:కరణంలోని రెండవ అంగం చిత్తం! చిత్త స్వభావం ఎటెటో తిరుగాడుతూ ఉండటం. మనస్సు ఎప్పుడూ తిరుగాడదు. సుఖాన్ని అన్వేషించే పనిలో చిత్తం తిరుగుతూ వుంటుంది. కానీ అవన్నీ భౌతిక సుఖాలు, వినాశకారకాలైన కారణంగా, ఆ అన్వేషణ ఎప్పటికీ అంతమవదు. అందుకే అది తిరుగుతూనేవుంటుంది. ఆత్మసుఖం దొరికినపుడు దాన్ని తిరుగుడు ఆగిపోతుంది. చిత్తం, జ్ఞాన-దర్శనంతో తయారైంది. అశుద్ధ జ్ఞాన-దర్శనం అంటే అశుద్ధ చిత్తం, ప్రాపంచిక చిత్తం. శుద్ధ జ్ఞాన-దర్శనం అంటే, శుద్ధ చిత్తం, అంటే శుద్ధాత్మ.

బుద్ధి, ఆత్మ యొక్క ఇన్‌డైరెక్ట్ లైటు. ప్రజ్ఞ డైరెక్ట్ లైటు. బుద్ధి ఎప్పుడూ లాభనష్టాల గురించి చెప్తుంటుంది. ప్రజ్ఞ ఎప్పుడూ మోక్ష మార్గాన్నే తెలియజేస్తుంటుంది. ఇంద్రియాల పైన మనస్సు, మనస్సు పైన బుద్ధి, బుద్ధి

పైన ఆహంకారం, వీటన్నిటి పైనా ఆత్మ ఉంటుంది. మనస్సు, చిత్తాలు రెండిటిలో ఏదో ఒకటి చెప్పేది విని బుద్ధి నిర్ణయం తీసుకుంటుంది. అహంకారం గుడ్డిది కనుక బుద్ధి చెప్పినదానిని అనుసరించి, దాని మీద తన సంతకం పెడుతుంది. దాని సంతకం పడుతూనే ఆ కార్యం బాహ్యకరణం అయిపోతుంది. అహంకారం కర్త, భోక్త అవుతుంది. అది స్వయంగా ఏమీ చెయ్యదు. అది కేవలం అనుకుంటుంది, 'నేను చేసాను' అని. అదే సమయంలో అది కర్త అయిపోతుంది. ఇక అది భోక్త అవక తప్పదు. సంయోగం కర్త కాని, నేను కాదు అనే జ్ఞానం కలుగుతూనే అకర్త అయిపోతారు. దానివలన వాళ్ళకి కర్మ ఛార్జ్ అవదు. అంత:కరణంలోని క్రియలన్నీ మెకానికల్ (యాంత్రికం) అయినవే. అందులో ఆత్మ ప్రమేయమేమీ ఉండదు. ఆత్మ కేవలం జ్ఞాత, ద్రష్ట, పరమానంద స్వరూపం మాత్రమే.

–డా. నీరూ బెహన్ అమీన్

దాదా భగవాన్ నిర్వచించిన

అంత:కరణ స్వరూపం

జ్ఞాని పురుష్, విశ్వానికి అబ్జర్వేటరీ

'జ్ఞాని పురుష్' ని వర్ల్డ్ అబ్జర్వేటరీ అంటారు. బ్రహ్మాండంలో జరుగుతున్నదంతా 'జ్ఞాని పురుష్' కి తెలుసు. వేదాలను మించిన విషయాలను 'జ్ఞాని పురుష్' చెప్పగలుగుతారు.

మీరేమైనా అడగండి నాకు తప్పునిపించదు. ప్రపంచమంతటిలోని సైంటిస్ట్‌లు అడిగే మైండ్ అంటే ఏమిటి, అది ఎలా పుడుతుంది, అది ఎలా అంతమౌతుంది, అనే జ్ఞానాన్ని నేను ఇస్తాను. మైండ్, బుద్ధి, చిత్తం, ఇగోయిజమ్, అలా అన్ని విషయాలకి సంబంధించిన పూర్తి సైన్స్‌ని ప్రపంచానికి ఇవ్వటానికే నేను వచ్చాను. మైండ్ అంటే ఏమిటి, బుద్ధి అంటే ఏమిటి, చిత్తం అంటే ఏమిటి, ఇగోయిజమ్ అంటే ఏమిటి, ఇవన్నీ తెలుసుకోవాలి.

ప్రశ్నకర్త : మనసు కలిగినవాడినే మనిషి అంటారా?

దాదాశ్రీ : ఔను. అంతే. కాని ఈ జంతువులలో కూడా మనస్సు ఉంది. కాకపోతే వాటి మనస్సు లిమిటెడ్, మనిషిది అన్‌లిమిటెడ్ మైండ్. తాను స్వయంగా భగవాన్ అవగలిగిన మైండ్ ఉంది అతని దగ్గర.

మనో గ్రంథి నుండి విముక్తి ఎలా కలుగుతుంది?

ప్రశ్నకర్త : ఈ మనస్సుందే, అదే పెద్ద కష్టాలను తెచ్చిపెట్టేది.

దాదాశ్రీ : కాదు. మనస్సు ఎంతో లాభాన్ని కలిగిస్తుంది. అది మోక్షానికి కూడా తీసుకెళ్తుంది.

ప్రశ్నకర్త : మనస్సంటే ఏమిటి?

దాదాశ్రీ : అది కేవలం ఒక గ్రంథి. మనస్సు ఎన్నో గ్రంథులతో కూడి తయారౌతుంది.

ఈ సమ్మర్ సీజన్‌లో మీరు పొలంలోకి వెళ్తే పొలంలో మేడ్ (గట్టు) ఉంటుంది. మీరంటారు, నా మేడ్ మీద తీగలేమీ లేవని, పూర్తిగా సాఫ్‌గా ఉందని. అప్పుడు నేనంటాను, జూన్ నెలలో 15వ తారీఖు తర్వాత చూడు, అప్పుడు వర్షం పడ్డప్పుడు నీకు అర్థమౌతుంది. వర్షం పడ్డ తర్వాత మీరే అంటారు, అంతంత తీగ వచ్చిందే అని. అందుకు నేనంటాను, 'తీగ వచ్చింది కదా, దాని గ్రంథి లోపల ఉంటుంది, నీటి సంయోగంతో అది మొలకెత్తుతుంది' అని. అలాగే మనిషికి మనస్సు అనేది ఉంది, అది గ్రంథి రూపంలో ఉంది. విషయ గ్రంథి, లోభ గ్రంథి, మాంసాహార గ్రంథి, అలా అన్నిటి గ్రంథులు. కానీ వాటికి టైం రాలేదు. సంయోగం కలుగలేదు. అప్పటి వరకు ఆ గ్రంథి పగలదు. దాని టైము వచ్చి, సంయోగం కలిగినపుడు గ్రంథి లోనుంచి ఆలోచన వస్తుంది. ఆడమనిషిని చూసినపుడు ఆలోచన వస్తుంది, చూడనంత వరకు ఏమీ ఉండదు.

మీకు వచ్చిన ఆలోచన ఇతరులకు రాదు. ఎందుకంటే, మనుషుల గ్రంథులు వేరు వేరుగా ఉంటాయి. కొందరు మనుషులకు మాంసాహార గ్రంథే ఉండదు కనుక, వాళ్ళకి ఆ ఆలోచనే రాదు.

ముగ్గురు కాలేజీ అబ్బాయిలున్నారు. అందులో ఒకడు జైన్, ఒకడు ముస్లిం, ఒకడు వైష్ణవుడు. ఆ ముగ్గురూ సమాన వయస్కులు. ముగ్గురి మధ్య ఫ్రెండ్‌షిప్

ఉంది. జైన్ అబ్బాయికి మాంసాహారం తినే ఆలోచన అసలే రాదు. 'నాకు అది ఇష్టం ఉండదు, దాన్ని చూడటానికే నేను ఇష్టపడను' అంటాడతను. వైష్ణవ కుర్రవాడు, 'నాకు అప్పుడప్పుడూ మాంసాహారం తినాలనిపిస్తుంది కానీ నేను ఎప్పుడూ తినలేదు' అంటాడు. మూడవవాడైన ముస్లిం కుర్రవాడు, 'నాకైతే మాంసాహారం తినాలనే ఆలోచన బాగా ఉంటుంది. నేను నాన్ వెజిటేరియన్‌ని బాగా ఇష్టపడతాను. మేము రోజూ హెూటల్‌లో ఒక మోతాదు పడాలి' అంటాడు.

అందుకు కారణం ఏమిటి? ముస్లింకి మాంసాహారం మీద బాగా ఆలోచన వస్తుంది. వైష్ణవునికి ఆ ఆలోచన వస్తుంది కాని, జైన్‌కి అసలు ఆ ఆలోచనే రాదు. జైన్‌లో మాంసాహార గ్రంథి ఉండనేవుండదు. వైష్ణవునికి ఒక చిన్న గ్రంథి, ముస్లింకి ఇంత పెద్ద గ్రంథి ఉంటుంది. ఏ గ్రంథి ఉంటే ఆ ఆలోచనే వస్తుంది. వేరే ఆలోచన రాదు. ఆలోచనలు ఎన్నో రకాలుగా ఉంటాయి. కానీ, మీకు లోపల ఎన్ని గ్రంథులుంటే అన్ని ఆలోచనలు వస్తాయి.

గ్రంథి ఎలా పడుతుంది? ఈ జన్మలో మాంసాహారం తినకపోయినా, ఒకవేళ ఎవరైనా ముస్లిం కుర్రవాడి సాంగత్యంలోకి వచ్చినట్లయితే, అతను, 'మాంసాహారం తినటంలో ఎంతో మజా ఉంటుంది' అని అంటే, 'ఔను నిజమే. ఇది సరైనదే' అనే అభిప్రాయం మీకు కలుగుతుంది. అప్పుడు మీకు కూడా మనసులో, 'మాంసాహారం తినటం వలన నష్టమేమీ లేదు' అనే భావన కలుగుతుంది. ఆ గ్రంథి తయారై ఆ గ్రంథి మైండ్‌లోకి పోయి చేరుకుంటుంది. ఇక ఆ తర్వాత జన్మలో మీరు మాంసాహారం తింటారు. మీకు అర్థమౌతోందా? అందువలన అటువంటి ఫ్రెండ్ సర్కిల్‌ని పెట్టుకోనేవద్దు. వెజిటేరియన్ ఫ్రెండ్ అయితేనే అతనితో కలిసివుండాలి. ఎందుకంటే మీరే ఆ గ్రంథిని తయారు చేసుకుంటారు. భగవంతుడు దాన్ని తయారుచేయలేదు. మనసుని మీరే తయారుచేసుకున్నారు.

మనసు డిశ్చార్జ్ అవుతుంటుంది. ఛార్జ్ అయిందే డిశ్చార్జ్ అవుతుంది. ఆ డిశ్చార్జ్ ఎలా అయినా అవొచ్చు. కానీ ఎలాంటి భావంతో ఛార్జ్ అయిందో, అటువంటి భావంతోనే డిశ్చార్జ్ అవుతూవుంది. వేరే మరేమీ లేదు.

జ్ఞాని పురుష్‌లను నిర్గంథులు అంటారు. నిర్గంథ్ అంటే ఏమిటి? మన మనసు ఒక సెకండైనా నిలకడగా ఉండదు. మీ మైండ్ ఎలాంటిది? పావుగంట పావుగంట, అరగంట అరగంట తిరుగుతూవుంటుంది. బెల్లం చుట్టూ ఈగ ముసిరినట్లుగానే మీ మైండ్ కూడా తిరుగుతుంటుంది. ఎందుకంటే మీరు గ్రంథి ఉన్నవారు కనుక. మైండ్ మనది కాదు. మైండ్ ఎలాంటిది? ఫిల్మ్ నడుస్తున్నట్లుంటుంది. దాన్ని ఒక ఫిల్మ్‌లా మనం చూస్తుంటాం, ఫిల్మ్ ఎలా నడుస్తున్నదా అని.

ఒక నగరవాసి దర్శనం కోసం వస్తుండేవాడు. అతను లోభి. అతను వయసు కూడా పెద్దదే. అతనితో నేను, నువ్వు రోజూ రిక్షాలో వచ్చి రిక్షాలో పోరాదా? ఎందుకు ఇంత కష్టపెట్టుకుంటూ వస్తావు? డబ్బులు ఏం చేసుకుంటావు? నీ అబ్బాయి కూడా సంపాదిస్తున్నాడు అన్నాను. అతను అందుకు, 'ఏం చెయ్యను, నా స్వభావమే అలా లోభంతో కూడుకునివుంది. అందరూ భోజనానికి కూర్చున్నపుడు నేను అందరికీ లడ్డూ పంచిపెట్టటానికి వెళ్ళి, వాటిని ముక్కలు చేసి ఒక్కొక్కరికీ సగం సగమే వడ్డిస్తాను. నా స్వభావమే అలాంటిది' అన్నాడు. అప్పుడు నేను అతనితో, 'ఈ లోభం వలన నీకు చాల దుఖం ప్రాప్తిస్తుంది. అది నీకు లోభ గ్రంథిగా తయారైంది' అన్నాను. దాన్ని తొలగించే ఉపాయం చెప్పాను, 'పదిహేను, ఇరవై రూపాయల చిల్లరగా తీసుకో. ఇక్కడికి రిక్షాలో రా. వచ్చేటప్పుడు దారిలో కొద్ది కొద్దిగా ఆ డబ్బులను పడేసుకుంటూ రా' అని. ఒకసారి అతను అలాగే చేసాడు. అతనికి ఎంతో ఆనందం కలిగింది. అలా అతనికి ఒక ఆనంద మార్గాన్ని తెలియజేసాను. ఇతను డబ్బులు విసిరేస్తూ వస్తే అవి నదిలోకి కలిసిపోయాయా? లేదు. దారిలో మనుషులు వాటిని తీసుకుంటారు. ఇక్కడ దారిలో డబ్బులు పడివుండవు. దీనివలన నీకు కలిగే లాభమేమిటంటే, మీ మైండు ఉందే, దానికి అర్థమౌతుంది ఇక దాని మాటలేమీ చెల్లవని. దానితో లోభ గ్రంథి పగిలిపోతుంది. అలా పదిహేను ఇరవై రోజులు డబ్బులు వెదజల్లుతూ పోతే ఆనందం ఎంతో కలుగుతుంది, ఇక మనసు మన విషయంలో చెయిపెట్టదు. మనస్సు అర్థం చేసుకుంటుంది నాదేమీ ఇక చెల్లదని. మనసు మరుగైపోతుంది.

ఎన్ని అవతారాలలో మీకు మైండు ఉంది?

ప్రశ్నకర్త : ఏమో తెలియదు. ఈ మైండ్ అనేది ఎలా పుడుతుంది?

దాదాశ్రీ : ప్రపంచమంతా మైండ్‌కి భయపడుతుంది. ఏమిటీ మైండ్ అంటే అన్నది తెలుసుకోవాలి. మైండ్ అంటే వేరే ఏమీ కాదు, పూర్వ జన్మలోని ఒపీనియన్ (అభిప్రాయం). కేవలం గత ఒక్క జన్మ ఒపీనియనే. ఈ రోజు మీ ఒపీనియన్ ఈ రోజు కలిగే జ్ఞానంతో కలుగుతుంది. మీరు ఏ జ్ఞానాన్ని విన్నారో, ఏ జ్ఞానాన్ని చదివారో, అది ఈ రోజు మీ ఒపీనియన్. పూర్వ జన్మలోని జ్ఞానం ఏదైతో ఉందో, దానివలన ఏ ఒపీనియన్ అయితే కలిగిందో, ఆ ఒపీనియన్ అంతటినీ ఈరోజు మైండ్ మీకు చెప్తుంది. దానివలన ఆ రెండిటిలో ఘర్షణ మొదలౌతుంది. ఈ విధంగా ప్రపంచమంతా మైండ్‌కి పరవశమైవుంది, దు:ఖంతో కూడుకునివుంది.

ఒక మనిషితో అతని భార్య రోజూ జగడం పెట్టుకుంటూవుంటుంది, నీ ఫ్రెండ్ సర్కిల్ అంతా పెద్ద పెద్ద బంగళాలు కట్టుకున్నారు. మీరు ఇంత పెద్ద ఆఫీసర్ అయ్యుండి ఏమీ చెయ్యలేదు. మీరు లంచం ఎందుకు తీసుకోరు? మీరు లంచం తీసుకోవాలి. ఇలా రోజూ అంటూవుండేది. దానితో అతనికి కూడా 'లంచమైతే తీసుకోవలసిందే' అనిపిస్తుంది. ఇక ఆ నిర్ణయంతో ఆఫీసుకి వెళ్తాడు. కానీ లంచం తీసుకోవలసిన సమయంలో తీసుకోలేకపోతాడు. ఎందుకంటే అతని పూర్వజన్మలోని ఒపీనియన్ అతన్ని లంచం తీసుకోనివ్వదు. ఈ రోజు కలిగిన ఒపీనియన్, 'లంచం తీసుకోవలసిందే, లంచం తీసుకోవటమే మంచిది' అని. అలాంటప్పుడు వచ్చే జన్మలో అతను లంచం తీసుకుంటాడు. ఎవరైనా లంచం తీసుకునేటప్పుడు, అతనికి బాధ కలుగతుంటుంది, 'లంచం తీసుకోగూడదు కదా, ఇది మంచిది కాదు. కానీ ఎందుకలా జరిగిపోతూవుంది?' అని. అతను తర్వాత జన్మలో లంచం తీసుకోడు. లంచం తీసుకునేవాళ్ళకి అది అడ్వాన్స్ అవుతుంది. అతను లంచం తీసుకోడు కానీ, అధోగతిలోకి పోతాడు.

మైండ్‌ని కన్న ఫాదర్-మదర్ ఎవరు?

ప్రశ్నకర్త : అభిప్రాయమే అన్నిటికీ మూలమా?

దాదాశ్రీ : ఔను. అభిప్రాయంతోనే ప్రపంచం నిలబడుతుంది. అభిప్రాయంతోనే, ఇతను దొంగ, ఇతను లుచ్ఛా, ఇతను బద్మాష్ అలా అవుతుంటుంది. ఈ మైండ్ కూడా అభిప్రాయంతోనే తయారైంది. మైండ్‌కి అభిప్రాయం ఫాదర్. మదర్ వేరే ఉంది. అది నేను తర్వాత చెప్తాను. మైండ్ మదర్-ఫాదర్ గురించి ఎవరూ చెప్పనేలేదు.

నాకు అభిప్రాయమనేదే ఉండదు. ఒకడు నా జేబులోంచి 200 రూపాయలు తీసుకున్నాడు. అది నేను స్వయంగా చూసాను. అయినా రెండవ రోజు అతను నా దగ్గరికి వస్తే, 'ఇతను దొంగ' అని అనిపించదు. నేను పూర్వంలో గ్రహించినదాన్ని పెట్టుకోను. అతన్ని 'దొంగ' అంటే భగవంతుడి మీద ఆరోపణ చేసినట్లే. ఎందుకంటే, లోపల ఉన్నది భగవానే కదా.

ప్రశ్నకర్త : అభిప్రాయం ఎలా ఏర్పడుతుంది?

దాదాశ్రీ : అభిప్రాయమనేది మీ రాంగ్ బిలీఫ్ 'ఈ మనిషి దొంగ' అని. 'ఇతను దొంగ' అన్న మాటను వినటం వలన అది నిజమని అనుకుంటున్నారు, అప్పుడు అటువంటి అభిప్రాయం ఏర్పడుతుంది. ఎవరి అభిప్రాయాన్నీ నీదిగా తీసుకోకు. ఇతను మంచి దాత, ఇతను మంచి మనిషి, అటువంటి అభిప్రాయాన్ని కూడా పెట్టుకోవద్దు.

ప్రశ్నకర్త : మనస్సుని కంట్రోల్ ఎలా చేసుకోవాలి?

దాదాశ్రీ : మనస్సుని కంట్రోల్ చేసుకోవలసిన అవసరమే లేదు. అందరూ చేసే పనేమిటి? దేన్నయితే కంట్రోల్ చేసుకోగూడదో, దాన్నే కంట్రోల్ చేస్తుంటారు, దేన్నయితే కంట్రోల్ చేసుకోవాలో దాన్ని అర్థమే చేసుకోరు. అందులో మనసు చేసిన తప్పేమిటి పాపం?

ఒక రచయిత వచ్చాడు నా దగ్గరికి. నాతో అనసాగాడు, 'నా మనస్సు ఆపరేషన్ చేయండి' అని. నేనన్నాను, 'తే. ఇప్పుడు చేసేస్తాను. కానీ నాకు విట్‌నెస్ (సాక్షి) సిగ్నేచర్ (సంతకం) కావాలి' అని. అతను అడిగాడు, 'విట్‌నెస్ దేనికి?' అని. అప్పుడు నేనన్నాను, 'మనసుకి ఆపరేషన్ చేసేస్తాను, ఏమైనా కష్టం వస్తే నా మెడకి చుట్టుకుంటుంది' అని. దానికి అతను, 'అరె, అందులో కష్టమేముంది? మనస్సు వెళ్ళిపోయిందంటే ఆనందమే కదా, ఎంత హాయిగా సరదాగా గడపవచ్చో' అన్నాడు. అందుకు నేను, 'లేదు భాయ్ నేను మీకు ముందే చెప్తున్నా, నేను మీ మనసుకి ఆపరేషన్ చేస్తే మీరు ఆబ్సెంట్ మైండెడ్ అయిపోతారు. పరవాలేదా మరి?' అన్నాను. అప్పుడతను, 'లేదు లేదు ఆబ్సెంట్ మైండెడ్ అవగూడదు' అన్నాడు. అతనికి విషయం అర్థమైంది. నేను చెప్పేదేమిటంటే, 'మనసుని మృత్యువుపాలు చేసే అవసరం లేదు'. మనసుకి ఎటువంటి కష్టం కలిగించవద్దు. మనసుని కదిలించవద్దు. మనసుని ఎప్పుడు కదిలించాలి అంటే వ్యగ్రతలో (ఏకాగ్రత లేకుండా పోయిప్పుడు). అలాంటప్పుడు ఏకాగ్రతకి ప్రయత్నించాలి. వ్యగ్రత లేనివారికి అంటే, కాయకష్టం చేసేవారికి వ్యగ్రత ఉండదు. అలాంటివారికి ఏకాగ్రతలోకి వెళ్ళే అవసరం పడదు.

సోల్ (ఆత్మ) కి మరణం ఉండదు. రిలేటివ్ నశిస్తుంది. మైండ్ రియలా, రిలేటివా?

ప్రశ్నకర్త : మైండ్ విత్ బాడీ అనేది రిలేటివ్. మైండ్ విత్ సోల్ రియల్.

దాదాశ్రీ : రెండూ నిజమే. మైండ్ విత్ బాడీని నేను ద్రవ్యమనసు అంటాను. మైండ్ విత్ సోల్‌ని నేను భావమనసు అంటాను. మనం మైండ్ విత్ సోల్‌కి ఆపరేషన్ చేసి తొలగిస్తాం. సోల్‌తో ఉండే మైండ్‌కి ఫాదర్ మదర్ పేర్లేమిటి? ఒపీనియన్ ఈజ్ ద ఫాదర్ అండ్ లాంగ్వేజ్ ఈజ్ ద మదర్ ఆఫ్ మైండ్.

ప్రశ్నకర్త : దెన్, హూ ఈజ్ ద ఫాదర్ అండ్ మదర్ ఆఫ్ సోల్?

దాదాశ్రీ : నో ఫాదర్, నో మదర్, నో బర్త్, నో డెత్ ఆఫ్ సోల్. వేర్ దేరీజ్ బర్త్ అండ్ డెత్, దెన్ దేరీజ్ ఫాదర్ అండ్ మదర్. మనసుని మూసివుంచాలంటే ఒపీనియన్‌ని పెట్టుకోకు. అప్పుడు మైండ్ నశిస్తుంది.

ప్రశ్నకర్త : మీరు చెప్పినట్లుగా మైండ్‌ని నాశనం చేస్తే, మనల్ని గైడ్ చేసేవారు, మార్గదర్శనం చేసేవారు ఎవరు? మైండ్ అనేదే లేకపోతే మార్గదర్శనం ఎవరు చేస్తారు? గైడ్ చేయటానికి మైండ్ అవసరం కదా?

దాదాశ్రీ : మైండ్ విత్ సోల్ నశిస్తే, మైండ్ విత్ బాడీ మిగిలివుంటుంది. ఇక డిశ్చార్జే ఉంటుంది కాని కొత్తగా ఛార్జ్ అవదు. ఈ బాడీతో ఉన్న మైండ్ స్థూలమైనది. అది కేవలం థింకింగ్ మాత్రమే చేస్తుంది.

మామిడి పండు తినేటప్పుడు పుల్లగా ఉంటే ఒక పక్కకి పెట్టెయ్యి. కానీ, ఇది పుల్లగా ఉంది అనే ఒపీనియన్ పెట్టుకుంటే మైండ్‌కి జన్మనివ్వటం అవుతుంది కదా. మామిడి పండు బాగుంటే తిను కానీ ఒపీనియన్ పెట్టుకోవలసిన అవసరం ఏముంటుంది? హొటల్‌వాళ్ళు మీకు చాయ్‌నిచ్చారు, చాయ్ నచ్చకపోతే పక్కన పెట్టెయ్యి. డబ్బులిచ్చేసి వెళ్ళిపో. అంతేకానీ, ఒపీనియన్ ఇవ్వవలసిన అవసరం ఏమిటి?

ప్రశ్నకర్త : సంకల్ప వికల్పాలు మనస్సు స్వభావం కదా?

దాదాశ్రీ : భ్రాంతి ఉన్నంత వరకు మన స్వభావం ఉంటుంది. మనసు తన ధర్మాన్ని తాను పాటిస్తుంది. నిరంతరం ఆలోచిస్తూవుంటుంది. కానీ భ్రాంతి వలన మనిషి, 'నాకు అలాంటి ఆలోచన వస్తుంటుంది' అంటాడు. ఆలోచన అనేది మనసు ఐటమ్ (వస్తువు). మనస్సుకి స్వతంత్ర ధర్మమే ఉంది. కానీ మనం ఇతరుల ధర్మాన్ని తీసుకుంటాం. దానివలన సంకల్పం వికల్పమౌతుంది. నేను నిర్వికల్పంగానే ఉంటాను. మనసులో ఏమైనా ఆలోచన వస్తే, అందులో నేను తన్మయాకారమవను. ప్రపంచమంతా, ఏమైనా మంచి ఆలోచన వస్తే అందులో తన్మయాకారమౌతుంది. అదే చెడు ఆలోచన వస్తే ఏమంటారు? నాకు చెడు ఆలోచన వస్తుంది అని చెప్పి ఆ ఆలోచనకి దూరంగా ఉంటారు.

ప్రశ్నకర్త : నేను మైండ్ గురించి అర్థం చేసుకున్నంతవరకు, మైండ్‌కి ఇంకా చాలా విభాగాలున్నాయి– ఇమాజినేషన్, కల్పన, స్వప్నం, సంకల్పవికల్పం.

దాదాశ్రీ : లేదు. అవి మైండ్‌లో విభాగాలు కావు. మైండ్‌లో ఏమిటంటే, ఆలోచించే దశలో ఉన్నపుడు అది మైండు. వేరే ఏ దశలోను అది మైండ్ కాదు.

ప్రశ్నకర్త : మైండ్‌లో సంకల్పవికల్పాలు జరుగుతాయి కదా అవేమిటి మరి?

దాదాశ్రీ : అవి సంకల్ప వికల్పాలు కావు. అది మైండే. మైండ్ ఉంటే అది ఆలోచిస్తుంటుంది.

దుస్సాంగత్యంలో ఉండవద్దు, సత్సాంగత్యంలోకి రమ్మని అంటారు మనవాళ్ళు. సత్సంగంలోకి వెళ్తే ఏమౌతుంది, అభిప్రాయం మారిపోతుంది. అది ఎలా మారుతుందంటే అతని జీవితమే బాగుపడుతుంది. కానీ, సత్సంగం లభించకపోతే ఏం చెయ్యాలి? అలాంటప్పుడు అతనికి నేను మరో మార్గం సూచిస్తాను, 'భాయ్ అభిప్రాయాన్ని మార్చుకో. దుస్సాంగత్సంలో ఉన్నప్పటికీ అభిప్రాయాన్ని మార్చుకో' అని.

ఆలోచిస్తున్నపుడే మైండ్ అనేది ఉంటుంది. మిగతా సమయాలలో మైండ్ ఉండదు. జిలేబీ తినాలనే ఆలోచన వచ్చిందంటే, ఆ ఆలోచన అహంకారానికి ఇష్టమౌతుంది, 'అబ్బ ఎంత మంచి ఆలోచన వచ్చింది, జిలేబీ తెప్పించుకో' అనుకుంటారు. ఇందులో మైండ్ చేసేదేమీ ఉండదు. అది అహంకారం, అదే యోనిలో బీజం పడేటట్లుగా చేస్తుంది. ఏం చేస్తుంది?

ప్రశ్నకర్త : సంకల్పమనే బీజం వేస్తుంది.

దాదాశ్రీ : ఆ. మరి వికల్పం ఏం చేస్తుంది? ఎవరైనా వచ్చి ఈ దుకాణం నీదేనా అని అడిగితే ఏం చెప్తావు? 'ఔను. నేనే దీని యజమానిని' అంటావు. అదే వికల్పం. అర్థమైందా? యోనిలో బీజం వేసినపుడు సంకల్పం–వికల్పం అనిపించుకుంటుంది. సంకల్పవికల్పాలు మైండ్‌లో లేవు.

ప్రశ్నకర్త : అయితే ఆలోచన, అభిప్రాయం ఒకటేనా?

దాదాశ్రీ : కాదు వేరు వేరు. అభిప్రాయం కాజెస్ అయితే ఆలోచన దాని పరిణామం.

ఎవరైనా, 'ఇతనేమిటి ఇలా నల్లగా ఉన్నాడు?' అని అంటే, 'లేదు తెల్లగానే ఉన్నాను' అంటాడు. అదే వికల్పం. ఇది హండ్రెడ్ పర్సెంట్ కరెక్ట్.

ప్రశ్నకర్త : మైండ్‌లో సంకల్పవికల్పాలు లేవా?

దాదాశ్రీ : మైండ్‌లో సంకల్పవికల్పాలు ఉండవు. మైండ్ ఈజ్ న్యూట్రల్, కంప్లీట్ న్యూట్రల్.

ప్రశ్నకర్త : అంటే, సంకల్పవికల్పాలు చేసేది అహంకారమేనా?

దాదాశ్రీ : ఔనౌను. అహంకారమే సంకల్పవికల్పాలు చేస్తుంది.

వాటీజ్ మైండ్? అండ్, హుఈజ్ ఫాదర్ అండ్ మదర్ ఆఫ్ మైండ్? అందరూ మైండ్‌ని వశంలో పెట్టుకోవాలని అంటారు కానీ మైండ్ మన వశంలో ఉండనేవుండదు. అరె, పాపం దాన్నెందుకు వశపరచుకోవాలని అకుంటారు? నువ్వు నీ జాతిని వశపరచుకో. నేను అనేదేమిటంటే కంట్రోల్ దై సెల్ఫ్ (నిన్ను నువ్వు నియంత్రణలో ఉంచుకో)! మనసుని నియంత్రించాలనుకుంటే, మనసు ఎవరికి పుత్రుడు? అది వెతికి తెలుసుకున్నావా? మనసుని ఇచ్చింది భగవంతుడే అంటారు అందరూ. మరి భగవంతుడు అలాంటి మైండ్‌ని ఎందుకు ఇచ్చాడు? అరె, భగవంతుడిని ఎందుకు తిట్టుకుంటారు? భగవంతుడు మైండ్‌ని ఎక్కడి నుంచి తీసుకునివచ్చాడు? భగవంతుడికి మైండ్ అనేది ఉంటే భగవంతుడిని కూడా మైండ్ చికాకు పెట్టేదే. కానీ మైండ్ చికాకు పెట్టదు. మైండ్‌ని ఎందుకు కంట్రోల్ చేసుకోవటం? కంట్రోల్ దైసెల్ఫ్. మైండ్ మదర్ ఎవరు? లాంగ్వేజ్ ఈజ్ ద మదర్! క్రిస్టియన్ మైండ్‌కి క్రిస్టియన్ మదర్, ఇండియన్ మైండ్‌కి ఇండియన్ మదర్ ఉండాలి. మదర్స్ ఆర్ సెపరేట్. ఒపీనియన్ ఈజ్ ద ఫాదర్ కామన్ టు ఆల్. క్రిస్టియన్ లాంగ్వేజ్ అండ్ ఒపీనియన్, క్రిస్టియన్ మైండ్ అవుతుంది.

ప్రశ్నకర్త : మీరు గ్రాడ్జుయేషన్ చేసారా? మీది చాల హై లాంగ్వేజ్.

దాదాశ్రీ : లేదు బాబూ, నేను మెట్రిక్ ఫెయిల్.

మైండ్‌కి ఒక సొల్యూషన్ ఈ ప్రపంచంలో ఎవరూ ఇవ్వలేదు. కాని నేను సొల్యూషన్ ఇస్తాను. మైండ్ ఎలా ఉంటుంది? హు ఈజ్ ద ఫాదర్ అండ్ మదర్ ఆఫ్ మైండ్? మైండ్ జననం ఎక్కడ జరిగింది? ఫాదర్ మదర్‌ని తెలుసుకుంటే మైండ్ వెళ్ళిపోతుంది. రెండిట్లో ఒకటి మరణిస్తే మైండ్ ఎలా ఉంటుంది?

ఒక పుస్తకమే రాయవచ్చు అంత వుంది. ఒక వాక్యంలో చెప్తాను– ఒపీనియన్ ఈజ్ ద ఫాదర్ అండ్ లాంగ్వేజ్ ఈజ్ ద మదర్ ఆఫ్ మైండ్! మహరాష్ట్రియన్ లాంగ్వేజ్ ఉంది కనుక మహరాష్ట్రియన్ మైండ్ ఉంది. ఇంగ్లీషు లాంగ్వేజ్ ఉంది కనుక ఇంగ్లీష్ మైండ్ ఉంది. మీకేమైనా అర్థమైందా కొద్దిగా?

నాకు ఎవరి గురించీ అభిప్రాయమనేదే ఉండదు. మనం చూసేవి రెండు. రియల్‌ని భగవాన్ గాను, రిలేటివ్‌ని నిర్దోషిగాను చూస్తాను. ఇక ఒపీనియన్ అనేదేమి ఉంటుంది. ఒపీనియన్ పెట్టుకునేవారికి దోషిగానే కనిపిస్తుంది. నిజం చెప్పాలంటే జగత్తంతా నిర్దోషే. కంటికి కనిపించేదంతా నిజం కాదు. ఇదంతా భ్రాంతి. వాస్తవానికి ఈ జగత్తులో దోషులెవరూ లేరు. కానీ మీరు దోషితులుగా చూస్తే అది మీకే నష్టం కలిగిస్తుంది. నన్నెవరైనా తిట్టినట్లయితే నాకు వాళ్ళు దోషులుగా కనిపించరు.

ప్రశ్నకర్త : అలాంటి దృష్టి ఏర్పడితే ఇక ప్రపంచంలో బంధనాలే మిగలవు కదా?

దాదాశ్రీ : అరె, ఇక మైండ్ అనేదే ఉండదు.

లాంగ్వేజ్ ఎప్పుడూ ఒపీనియన్‌తోనే ఉంటుంది. ఒపీనియన్ మాట్లాడటం మొదలుపెట్టినపుడు లాంగ్వేజ్‌కి కూడా మాట్లాడక తప్పదు. ఒపీనియన్ అనేదే లేకపోతే మైండ్ నశిస్తుంది. ఇది మీకు అర్థమౌతోందా?

ఒక జైన్ కుర్రవాడున్నాడు. అతన్ని మీరు, ‘నీకు మాంసాహారం మీద ఆలోచన వస్తుందా?’ అని అడిగితే అతను, ‘ఎప్పుడూ రానేలేదు’ అంటాడు. ఎవరైనా ముసల్మాన్‌ని అడిగితే, ‘నాకు రోజూ తినటానికి అదే కావాలి’ అంటాడు. ఆ జైన్ పూర్వ జన్మలో మాంసాహారం మీద ఒపీనియనే పెట్టుకోలేదు కనుక అతనికి ఆ మైండ్ ఏర్పడలేదు. ముసల్మాన్ మాంసాహారం మీద ఒపీనియన్ పెట్టుకున్నాడు కనుక అతనికి ఆ మైండ్ ఏర్పడింది. ఈ జన్మలో ఆ ఒపీనియన్‌ని తొలగించేసేయి. అప్పుడు మరు జన్మలో మైండ్ సాఫ్ అయిపోతుంది.

ఇతన్ని కొట్టాలి అనే ఒపీనియన్ ఉంటే మైండ్ ఆ తర్వాత జన్మలో ఏం చెప్తుంది? ‘కొట్టు సాలెగాడిని’ అంటుంది. ఏ ఒపీనియన్ అయితే ఉందో దానికో కొడుకు, కూతురు పుట్టారు. వాళ్ళంతా కొట్టు కొట్టు అని చెప్తారు. మరి మీరేమో నా మైండ్ నా వశంలో ఎందుకు ఉండటం లేదు అంటారు. అరె ఎలా ఉంటుంది వశంలో? మీ వలనే మైండ్ ఏర్పడింది. నా స్పీచ్ మీకు అర్థమౌతోందా?

ప్రశ్నకర్త : ఇప్పుడు ఏర్పడ్డ అభిప్రాయానికి పరిణామం వచ్చే జన్మలో వస్తుంది కానీ, ఇంతకు ముందు ఏర్పడ్డ అభిప్రాయం మాటేమిటి?

దాదాశ్రీ : దాని ఫలితమే ఈ మైండు. ఈ మైండ్ ఉందికదా దానితో మీకు తాళం కలుస్తుంది (ట్యాలీ అవుతుంది) పూర్వ జన్మలో మీరు దానికి ఇచ్చిన అభిప్రాయంతో. ఆలోచన వచ్చినపుడు రాసిపెట్టుకో ఇలాంటి అభిప్రాయాన్ని అందించాను అని. తర్వాత ఆ అభిప్రాయాలన్నిటినీ నశింపజేయి. ఇక మైండ్ నశిస్తుంది. నా మైండ్ నశించింది.

ప్రశ్నకర్త : అయితే మరి మనస్సు దేనిలో విలీనమైపోతుంది? ఎందుకంటే మనస్సుంటేనే జగత్తు ఉంటుంది కదా?

దాదాశ్రీ : మనస్సు దానంతటదే డిజాల్వ్ అయిపోతుంది, దాన్ని మళ్ళీ తయారుచేసుకోకపోతే. మైండ్ ఎప్పటికప్పుడు డిశార్చ్ అవుతూనేవుంటుంది.

కానీ మీరు మళ్ళీ దాన్ని ఛార్జ్ చేస్తుంటారు. అందుకు నేను ఏం చేస్తాను? ఛార్జ్ నిలిపివేస్తాను. ఇక డిశ్చార్జ్ అవనీ. ఇప్పుడు మీ మైండ్ ఛార్జ్ అవుతుంటుంది, డిశ్చార్జ్ కూడా అవుతుంటుంది.

ప్రశ్నకర్త : మరి జననమరణ చక్రం ఎలా ఆగిపోతుంది?

దాదాశ్రీ : మైండ్ పూర్తిగా డిశార్జ్ అయిపోయి తిరిగి ఛార్జ్ అవకపోతే ఆ చక్రం ఆగిపోతుంది.

చిత్త స్వరూపం

మైండ్ అంటే ఏమిటో కాస్త అర్థమైంది కదా? ఇప్పుడు ఈ చిత్తం అంటే ఏమిటి? హౌ ఇటీజ్ కంపోజ్?

ప్రశ్నకర్త : అది మనసులోని ఒక విభాగమే. ఒక విషయం మీద సరిగ్గా ఆలోచన చేస్తే, చింతన చేస్తే అదే చిత్తం.

దాదాశ్రీ : లేదు లేదు. చిత్తం, మైండ్‌ల మధ్య సంబంధమేమీ లేదు. మీరు చెప్పేది అటువైపు ఉంది. కానీ చిత్తమనేది ఏ వస్తువుతో కంపోజిషన్ (సంయోజనం) జరిగివుంది? జ్ఞానదర్శనం, ఇదే చిత్తానికి కంపోజిషన్. జ్ఞానము, దర్శనము రెండు విడిగా ఉంటాయి. ఆ రెండు మిక్చర్ అయిపోతే, దాన్ని చిత్తం అంటారు. వాటీజ్ డిఫరెన్స్ బిట్వీన్ జ్ఞానము, దర్శనము? మీరు కంటితో చూసేదాన్ని దర్శనం అనుకుంటారుకదా? అది దర్శనం కాదు. దర్శనం అని దేన్ని అంటారు? మీరు తోటలో చీకట్లో కూర్చున్నారు. పూర్తిగా చీకటిగా ఉంది, మీరు సత్సంగం చేస్తున్నారు. చీకట్లో సత్సంగం చేయటం వలన ఏమైనా ఇబ్బంది వుంటుందా? కానీ దగ్గర్లో ఏదో అలికిడి అయింది. ఒకతను, 'ఏదో ఉంది' అన్నాడు. మీరు కూడా 'ఏదో ఉంది' అన్నారు. నేను కూడా 'ఏదో ఉంది' అంటాను. ఏదో ఉన్నదనే జ్ఞానం వచ్చింది కదా, దాన్నే 'దర్శనం' అంటారు. ఇక అందరూ దాని గురించి ఆలోచించటం మొదలుపెడతారు, 'అదేమిటి' అని. శబ్దం ఎటునుంచి వచ్చిందో అందరూ అటువైపు వెళ్ళి చూస్తే అక్కడ ఒక

ఆవు ఉంది. 'ఇది ఆవు' అంటాను నేను. మీరు కూడా అలాగే, 'ఇది ఆవు' అంటారు. దీన్ని 'జ్ఞానం' అంటారు. అన్‌డిసైడెడ్ జ్ఞానాన్ని 'దర్శనం' అంటారు, డిసైడెడ్ జ్ఞానాన్ని 'జ్ఞానం' అంటారు. అర్థమైందా మీకు? జ్ఞానం, దర్శనం రెండూ కలిసిపోతే అది చిత్తం అవుతుంది. జ్ఞానం, దర్శనం అశుద్ధంగా ఉంటే అది చిత్తం అవుతుంది, జ్ఞానం, దర్శనం రెండూ శుద్ధమైతే అది ఆత్మ. చిత్తం అశుద్ధాన్ని చూస్తుంది, 'తనను తాను' చూసుకోదు. 'ఈమె నా అత్త, ఈయన నా మామ, అతను నా సోదరుడు' ఇలా అశుద్ధంగా చూస్తుందంటే అది అశుద్ధ చిత్తం. చిత్తశుద్ధి జరిగితే ఆత్మజ్ఞానం లభిస్తుంది.

ప్రశ్నకర్త : మరి ప్రజ్ఞ అని దేన్ని అంటారు?

దాదాశ్రీ : చిత్తం కంప్లీటుగా శుద్ధమైనట్లయితే అది ఆత్మ అవుతుంది. ఆత్మ ప్రాప్తి అవగానే ప్రజ్ఞ ప్రారంభమౌతుంది, ఆటోమేటిక్‌గా! ఒకటి అజ్ఞ, మరొకటి ప్రజ్ఞ. అజ్ఞ ఉన్నంతవరకు ప్రపంచం నుండి బయటకు పోనివ్వదు. ప్రపంచంలోనే ఇది ఇలా, అది అలా అని చెప్తుంది కాని, ప్రపంచం నుంచి బయటకు పోనివ్వదు. బుద్ధి ఉన్నంతవరకు అజ్ఞ ఉంటుంది. బుద్ధితో విషయం అర్థమౌతుంది. కానీ అది ప్యూర్‌గా చూపించదు. బుద్ధి ఇన్‌డైరెక్ట్ ప్రకాశం. జ్ఞానం డైరెక్ట్ ప్రకాశం. జ్ఞానం లభిస్తే ప్రజ్ఞ కలుగుతుంది, ప్రజ్ఞ అనేది మోక్షానికి దారితీస్తుంది. మనం వద్దన్నా సరే అది మనల్ని ఏదో ఒక విధంగా మోక్షంలోకే తీసుకెళ్తుంది.

ఇక్కడ కూర్చునివుండగానే మీ చిత్తం ఇంటికి పోతుంది. మనస్సు ఇంటికి పోదు. అందరూ అంటారు, నా మనస్సు ఇంటికి పోతుంది, అటు ఇటు తిరుగుతుంటుంది అని. అది నిజం కాదు. మనస్సు ఈ శరీరాన్ని వదిలిపెట్టి ఎప్పుడూ పోనేపోదు. బయటకు వెళ్ళేది చిత్తమే. ఒక అబ్బాయి చదువుకుంటున్నాడు కానీ, అతన్ని ఏమంటారు, నీ చిత్తం చదువులో లేదు, నీ చిత్తం క్రికెట్‌లో ఉంది అంటారు. మనసు అలా చూడలేదు. మనసు గుడ్డిది. సినిమా చూసి వచ్చిన తర్వాత కూడా చిత్తం దాన్నింకా చూడగలదు. ఈ చిత్తమే

బయటకు తిరిగితిరిగి వస్తుంది. ఎక్కడ సుఖం ఉందా అని అన్వేషిస్తూవుంటుంది. రెండు పదాలు మనుషులను కలతపెడుతుంటాయి– మైండు, చిత్తం.

మైండ్ ఈ బాడీ లోంచి బయటకు పోనేపోలేదు. మైండ్ ఈ బాడీ లోంచి బయటకు వెళ్తే ఎవరూ దాన్ని మళ్ళీ లోపలికి రానివ్వరు. కానీ అది బయటకు పోనేపోదు. మనస్సు ఆలోచనకి ప్రతిరూపం. అది ఆలోచన చేయటం తప్ప మరేమీ చెయ్యదు. కేవలం ఆలోచిస్తుందంతే. అన్ని చోట్లకీ తిరిగివచ్చేది, బయటకు వెళ్ళేది చిత్తమే. చిత్తం ఇక్కడ నుండి ఇంటికి పోయి టేబుల్, కుర్చీ, అల్మేరా అన్నీ చూస్తుంది. ఇంట్లో కొడుకు, కూతురు, భార్యను కూడా చూస్తుందే అది చిత్తం. బజారు మంచి వస్తువేమైనా చూస్తే కొనాలనే ఆలోచన వచ్చిందంటే చిత్తం అక్కడికి కూడా పోతుంది. అన్నీ చూడగలిగేదే చిత్తం. కానీ ఇప్పుడున్నది అశుద్ధ చిత్తం. అది శుద్ధమైతే అన్ని కార్యాలు నెరవేరుతాయి, సచ్చిదానంద స్థితి పొందుతారు.

సచ్చిదానందమనేది అన్ని మాటలకు ఎక్స్‌ట్రాక్ట్. ఆత్మ అనేది సచ్చిదానందం. భగవాన్ సచ్చిదానందం. సచ్చిదానందంలో సత్తు ఉంది. లోకంలో అంతా పంచేంద్రియాలతో చూస్తారు. అది సత్తు కాదు. సత్తు అంటే పర్మనెంట్ అయినది. ఆల్ దీజ్ రిలేటివ్స్ ఆర్ టెంపరరీ అడ్జస్ట్‌మెంట్స్. టెంపరరీ అయినదాన్ని సత్తు అనలేము. పర్మనెంట్ అయినదాన్నే సత్తు అంటాము. చిత్తమంటే జ్ఞానదర్శనం. సత్‌చిత్ అంటే శాశ్వతమైన జ్ఞానం, సత్యమైన దర్శనం. రైట్ జ్ఞానం, రైట్ బిలీఫ్. టెంపరరీని చూసేవారిది అశుద్ధ జ్ఞానదర్శనం. అంటే అశుద్ధ చిత్తం. ఇక్కడ చిత్తం అశుద్ధమైవుంది. చిత్తం శుద్ధమైతే పని జరిగిపోతుంది. చిత్తం శుద్ధమైనపుడు దాన్ని సత్‌చిత్ అంటారు. సత్‌చిత్ తో ఆనందమే లభిస్తుంది.

ప్రశ్నకర్త : అయితే ఆనందానికి నిర్వచనం ఏమిటి?

దాదాశ్రీ : ప్రపంచంలోని సత్యం సత్తు కాదు. వ్యవహారంలో అది సత్యం, లౌకికం. వాస్తవికత అలౌకికమైనది. లౌకికంలో వాస్తవికత లేదు. వాస్తవికత సత్తు, అది సత్యం కాదు. సత్తు అని దేన్ని అంటారు, నిరంతరం ఉండేదాన్ని,

నిత్యం ఉండేదాన్ని, దాన్నే సత్తు అంటారు. అనిత్యమైనదాన్ని సత్యం అంటారు. అది వర్ల్డ్ కి సంబంధించిన సత్యాసత్య సాపేక్షం. మీకు సత్యమని అనిపించేది, ఇతరులకు అసత్యమనిపిస్తుంది. కాని సత్తు అనేది ఎప్పటికీ మారదు. సత్తు అంటే పర్మనెంటు. చిత్తం అంటే జ్ఞానదర్శనం. జ్ఞానం, దర్శనం ఏకమైనపుడు అది చిత్తం అవుతుంది. పర్మనెంటు జ్ఞానదర్శనం అయితే దాని ఫలితం ఎలా ఉంటుంది? ఆనందం! పర్మనెంటు జ్ఞానదర్శనాన్ని ఏమంటారు? కేవల్! అబ్జల్యూట్!

బుద్ధి సైన్స్

దాదాశ్రీ : మీకు బుద్ధి ఉందా?

ప్రశ్నకర్త : ఏదో కొద్దిగా

దాదాశ్రీ : బుద్ధి ఎక్కువగా లేకపోతే మీరు పని ఎలా చేస్తారు? బుద్ధి అనేది లేకపోతే ఎవరైనా ఏ పనీ చేయలేరు. బుద్ధి అనేది ఈ ప్రపంచాన్ని నడిపించే ప్రకాశం. ప్రపంచంలో అది, డెసిషన్ (నిర్ణయం) తీసుకోవటానికి ఉంది. బుద్ధి ఉంటే డెసిషన్ తీసుకోగలుగుతారు. మీరు డెసిషన్ ఎలా తీసుకుంటారు?

ప్రశ్నకర్త : ఉన్న కొద్దిపాటి బుద్ధితోనే నడిపిస్తాను.

దాదాశ్రీ : మీదగ్గర ఎక్కువ బుద్ధి ఉన్నవారెవరైనా ఉన్నారా?

ప్రశ్నకర్త : ప్రపంచంలో చాలమంది ఉంటారు. వాళ్ళెవరో నాకు తెలియదు.

దాదాశ్రీ : ఏమాత్రం బుద్ధిలేనివాళ్ళు కూడా ఉంటారా?

ప్రశ్నకర్త : ఏమాత్రం బుద్ధిలేనివాళ్ళని ఎవరినీ నేను చూడలేదు. ఎందుకంటే ఎన్ని ప్రాణులున్నాయో, వాటి వాటి గ్రేడ్‌లకు అనుగుణంగా ఎంతో కొంత బుద్ధి ఉంటుంది.

దాదాశ్రీ : నాలో బుద్ధి లేదు. నేను పూర్తిగా అబుద్ధిని.

ప్రశ్నకర్త : ఆ. నిజమే. అబుద్ధి లిమిట్ వరకు చేరుకున్నపుడు ఆ మనిషి స్వయంబుద్ధ అవుతుండవచ్చు.

దాదాశ్రీ : ఔను స్వయంబుద్ధుడౌతాడు. అబుద్ధ అయినపుడు జ్ఞానప్రకాశమౌతారు. బుద్ధి ఉన్నంతవరకు ఒక పర్సెంటు కూడా జ్ఞానం ఉండదు. జ్ఞానం ఉన్నచోట బుద్ధి ఉండదు. నాకు జ్ఞానోదయం అయినపుడు బుద్ధి పూర్తిగా నశించింది.

మీలో చాల బుద్ధి ఉంది. మీ భార్య చేతి నుండి డబ్బులు కిందపడిపోతే వెనక్కి వెళ్తావు. డబ్బులు పడిపోయి కనిపిస్తే ఇమోషనల్ అయిపోతావు. ఈ బుద్ధి ఇమోషనల్ చేస్తుంది. ఇగోయిజమ్ ఉన్నంతవరకు బుద్ధి అనేది ఉంటుంది. నాలో బుద్ధి లేదు అని చెప్తే సరిపోతుందా?

ప్రశ్నకర్త : బుద్ధి ఎక్కువగా లేదు, ఏదో కొద్దిగా ఉంది.

దాదాశ్రీ : కొంచెం బుద్ధే ఎక్కువ బుద్ధి అవుతుంది. ఈ కాలంలో సమ్యక్ బుద్ధి అనేది తక్కువ, విపరీత బుద్ధి ఎక్కువగా ఉంది. ప్రపంచమంతటా చిన్న పిల్లలకు కూడా బుద్ధి ఉంటుంది. ఎవరి డబ్బులైనా దారిలో పడిపోయి కనిపిస్తే తీసుకుంటాడు కదా, అది బుద్ధి కాదా? అదంతా విపరీత బుద్ధి. సమ్యక్ బుద్ధి నా దగ్గర కూర్చుంటే వస్తుంది.

ఒకతను నన్ను అడిగేవాడు, 'ప్రపంచంలో జ్ఞానం ఎవరిదగ్గరా లేదా? మీ దగ్గరే ఉందా?' అని. అందుకు నేను, 'లేదు, జ్ఞానం ఉన్నవాళ్ళ దగ్గరున్నది సబ్జెక్ట్ జ్ఞానం. అది బుద్ధి జ్ఞానం. బుద్ధి కనెక్షన్‌తో వర్ల్డ్‌లోని అన్ని సబ్జెక్ట్‌లను తెలుసుకుంటారు కానీ అది అహంకారి జ్ఞానం. అందుకే అది బుద్ధిలో సమావేశమౌతుంది. కానీ నిరహంకారీ జ్ఞానమే జ్ఞానం' అని చెప్తాను. 'నేను ఎవరు?' ఈ మాత్రం తెలుసుకుంటే అతను 'జ్ఞాని'. జపతపత్యాగాలు అన్నీ సబ్జెక్ట్, విషయాలే. నిర్విషయ ఆత్మ విషయాలను పొందలేదు.

ప్రశ్నకర్త : సిద్ధులను పొందటం కూడా విషయాలలోకే వస్తుందా?

దాదాశ్రీ : అవన్నీ విషయాలే. అదంతా సబ్జెక్ట్ జ్ఞానమే. విషయారాధన చేస్తే మోక్షం రాదు. మీ దగ్గర బుద్ధి ఉంది, జగత్తుకీ బుద్ధి ఉంది కానీ నేను అబుద్ధను. బుద్ధి మనుషులకు ఏం చేస్తుంది? ఇమోషనల్ చేస్తుంది. ట్రైను మోషన్‌లో నడుస్తుంది. అది ఇమోషనల్ అయితే అప్పుడేం జరుగుతుంది?

ప్రశ్నకర్త : అంతా చెడిపోతుంది.

దాదాశ్రీ : అలాగే మనిషి ఇమోషనల్ అయితే, శరీరంలో ఉండే జీవాలన్నీ చచ్చిపోతాయి. వాటి పాపం తగులుతుంది. అందువలన నేను మోషన్‌లోనే ఉంటాను. నేను ఇమోషనల్ ఎన్నటికీ అవను. మీరు మోషన్‌లో ఉండాలనుకుంటున్నారా లేక ఇమోషన్‌లోనా?

ప్రశ్నకర్త : మోషన్‌లోనే ఉండాలనుకుంటున్నా.

దాదాశ్రీ : మనిషికుండే బుద్ధి ఏం చెప్తుంటుంది? లాభనష్టాల గురించి మాట్లాడుతుంది. బుద్ధి మరే విషయాన్నీ చెప్పదు. రైలు ఎక్కగానే 'ఏ జాగా బావుంది, ఎక్కడ బాగుండదు' అన్నది చూస్తుంది. బుద్ధి పనే మనకి లాభనష్టాలను చెప్పటం. నాలో అస్సలు బుద్ధి లేదు అంటే, నాకు ఎక్కడా లాభనష్టాలు వర్తించవు. ఇది మంచిది, ఇది చెడ్డది అన్నది ఉండదు. 'మీకు మా బంగ్లా ఎలా అనిపించింది?' అని ఎవరైనా అడిగితే, 'నాకు నీ బంగళా ఎప్పుడూ బాగనిపించలేదు. ఇక్కడే వదిలిపెట్టవలసిన బంగళాలో మంచి చెడు చూసేదేముంటుంది? ఈ బంగళా నుంచే అనామకుడు బయటకు వెళ్ళిపోతాడు' అంటాను.

బుద్ధి పరప్రకాశం, ఆత్మ స్వయంప్రకాశం. బుద్ధి, జ్ఞానం వేరువేరు. మీ దగ్గర జ్ఞానం ఉందా లేక బుద్ధా?

ప్రశ్నకర్త : బుద్ధి అయితే ఉంది, జ్ఞానం కోసం అక్కడిదాకా ఇంకా చేరుకోలేదు.

దాదాశ్రీ : బుద్ధి ఉంటే అక్కడ జ్ఞానం లేదు.

ప్రశ్నకర్త : అందుకే జ్ఞానం వరకు చేరుకునే ప్రయత్నం చేస్తున్నాను.

దాదాశ్రీ : లేదు, జ్ఞానంలో ప్రయత్నం చేయవలసిన అవసరం లేదు. అది సహజంగా జరిగేది. ప్రయత్నం చేయవలసిన పని లేదు.

ప్రశ్నకర్త : జ్ఞానం గురించి బుద్ధితో తెలుసుకోవద్దా, ఎందుకలా?

దాదాశ్రీ : ఔను. ఇది బుద్ధిని మించిన స్థితి. బుద్ధి ఎవరిదగ్గరైతే ఎంతమాత్రమూ ఉండదో, ఎవరైతే అబుద్ధో, అక్కడి నుంచే అది లభిస్తుంది. వర్ల్డ్‌లో ఎక్కడైనా అబుధ్ వ్యక్తిని ఎవరినైనా చూసారా? అందరూ బుద్ధిగలవాళ్ళనే చూసారా? ఈ వర్ల్డ్‌లో నేనొక్కడినే అబుద్ధుడను. నాలో బుద్ధి ఏమాత్రం లేదు, నాకున్నది జ్ఞానం. జ్ఞానం, బుద్ధిలలో డిఫరెన్స్ ఏమిటి? బుద్ధి ఇన్‌డైరెక్ట్ ప్రకాశం, జ్ఞానం డైరెక్ట్ ప్రకాశం. ఇవి రెండు వస్తువులైతే వీటిలో నేను ఒకదాన్ని పెట్టుకున్నా, డైరెక్ట్ ప్రకాశం! ఇన్‌డైరెక్ట్ ప్రకాశం నాకు వద్దు. డైరెక్ట్ ప్రకాశం లేనివాళ్ళకే ఇన్‌డైరెక్ట్ ప్రకాశం కావాలి. అందుకే వాళ్ళు క్యాండిల్ (కొవ్వొత్తి) పెట్టుకుంటారు. కానీ డైరెక్ట్ ప్రకాశం వచ్చినపుడు క్యాండిల్ అవసరం ఏముంటుంది? వర్ల్డ్‌లో అందరికీ క్యాండిల్ ఉంది. నా దగ్గర క్యాండిల్ లేదు. నా దగ్గర బుద్ధి లేదు.

ఇన్‌డైరెక్ట్ ప్రకాశమైనది డైరెక్ట్ ప్రకాశమెలా అవుతుంది? మీకు చెప్తాను. సూర్యనారాయణుని లైటు ఇక్కడ అద్దంలోకి డైరెక్ట్‌గా వస్తుంది. అద్దంలో కాంతి మీ వంటింట్లోకి వెళ్తుంది. వంటింట్లోకి పోయిన ప్రకాశాన్ని ఇన్‌డైరెక్ట్ ప్రకాశం అంటారు. అలాగే మనుషులందరి 'బుద్ధి' ఇన్‌డైరెక్ట్ ప్రకాశం. ఇక్కడ అద్దంలోకి వచ్చినది సూర్యనారాయణుని డైరెక్ట్ ప్రకాశం. ఆ డైరెక్ట్ ప్రకాశాన్ని 'జ్ఞానం' అంటారు.

సూర్యనారాయణుని లైటు అద్దం మీడియం థ్రూ పోతుంది. అక్కడ మీడియం అద్దం. అలాగే ఆత్మ లైటు ఇగోయిజమ్ మీడియం థ్రూ వెళ్తుంది. అది బుద్ధి. ఇగోయిజమ్ ఎలా ఉంటే, బుద్ధి కూడా అలాగే ఉంటుంది.

ప్రశ్నకర్త : మనకి మనం 'నేను' అంటాము కదా, ఆ నేనుని అహంకారం అంటారు కదా?

దాదాశ్రీ : ఔను. అది 'నేను' అనే అహంకారం, అక్కడ బుద్ధి ఉంటుంది. 'నేను' అనే అహంకారం లేని చోట 'జ్ఞానం' ఉంటుంది, ప్రకాశం ఉంటుంది. నాలో బుద్ధి లేదు, 'నేను' అనే అహంకారమూ లేదు. పెద్దపెద్ద మహాత్ములకు 'నేను, నేను, నేను' ఉంటుంది.

ప్రశ్నకర్త : మరి వాళ్ళు పెద్దవాళ్ళు ఎలా అయ్యారు? నేను, నేను, నేను అనుకుంటే వాళ్ళు పెద్దవాళ్ళు కాదు కదా?

దాదాశ్రీ : అదేమిటంటే, వాళ్ళ అవగాహనలో 'నేను పెద్దవాడిని' అని ఉంటుంది. అహంకారం మధ్యలో మీడియం. డైరెక్ట్ ప్రకాశం ఏదైతే వుందో, దాని మధ్యలో అహంకారం మీడియంగా ఉంటే ప్రతిబింబంగా బుద్ధి వస్తుంది. నాలో బుద్ధి లేదు ఎందుకంటే ఇగోయిజమ్ నశించింది కనుక. ఇక బుద్ధి ఎక్కడి నుంచి తెచ్చుకోను? నాలో ఏమాత్రం ఇగోయిజమ్ ఉన్నా, జ్ఞానం రాదు. ప్రకాశం రాదు. ఇగోయిజమ్ ఉన్నచోట బుద్ధి ఉంటుంది, ఇగోయిజమ్ లేకపోతే అక్కడ ఆత్మప్రకాశం ఉంటుంది.

బుద్ధి స్వభావం ఏమిటి? అది ఇన్‌డైరెక్ట్ ప్రకాశం. పైగా బుద్ధి ప్రతి ఒక్కరికీ పూర్తిగా ఉండదు. కొందరి దగ్గర 80 డిగ్రీ, కొందరి దగ్గర 81 డిగ్రీ, మరికొందరి దగ్గర 82 డిగ్రీ అలా డిగ్రీవాళ్ళే ఉంటారు. పూర్తిగా 100% బుద్ధి ఎవరికీ లేదు. 100% బుద్ధి ఉంటే వాళ్ళని బుద్ధ భగవాన్ అంటారు. ఆయన బుద్ధి 100% అయింది కాని అది ఇన్‌డైరెక్ట్ ప్రకాశంలో రాలేదు. ఆయన ఇగోయిజమ్ ఏమిటో తెలుసా? దయ, దయ, దయ.. ఇతనికి దు:ఖం, అతనికి దు:ఖం అలా దు:ఖంలో ఉన్నవాళ్ళని చూసి దయ కలుగుతుండేది. ఆయనికి ఏం జరిగింది? అది ఆయన ఇగోయిజమ్ కనుక ముందుకి జ్ఞానంలోకి వెళ్ళలేదు. ఆ ఇగోయిజమ్ మంచి ఇగోయిజమే. అందువలన ఆయన ముందుకి జ్ఞానంలోకి వెళ్ళలేదు. అది మంచి ఇగోయిజమే కాని ఇగోయిజమ్ మధ్యలో నిలిచింది.

అప్పటిదాకా ముందుకు ఎలా వెళ్ళగలరు? ఇకపోతే బుద్ధుడు భగవానుడయ్యాడు. ఒకవేళ ఒక స్టెప్ ముందుకి వెళ్ళివుంటే పూర్ణ భగవాన్ అయ్యుండేవారు. మహావీర్ భగవాన్ అయ్యారు కదా. అలా పూర్ణ భగవాన్ అయ్యుండేవారు.

నాలో బుద్ధి ఏమాత్రం లేదు. బుద్ధి ఉంటే అక్కడ మోక్షం ఎప్పటికీ ఉండదు, ఎప్పటికీ లభించదు కూడా. 24 మంది తీర్థంకరులకు బుద్ధి ఏమాత్రం లేదు.

ప్రశ్నకర్త : కానీ, వాళ్ళకి అనంత జ్ఞానం ఉందని అంటారు కదా?

దాదాశ్రీ : ఆ అనంత జ్ఞానం అంతా నిజమే కానీ బుద్ధి ఏమాత్రం లేదు. బుద్ధి అందరికీ ఉంటుంది. పేదవాళ్ళయినా సరే వాళ్ళకి బుద్ధి ఉంటుంది.

ప్రశ్నకర్త : అయితే, బుద్ధి జ్ఞానంలలో తేడా ఏమిటి?

దాదాశ్రీ : చాలా తేడా ఉంది. వెలుగు, చీకటికి ఉన్నంత తేడా ఉంది. ప్రపంచంలో తిరుగుతున్నవారు వాళ్ళ బుద్ధితోనే తిరుగుతుంటారు. బుద్ధితో భగవాన్ లభించరు, బుద్ధి మోక్షంలోకి వెళ్ళనివ్వదు. మోక్షంలోకి వెళ్ళకుండా బుద్ధి ప్రొటెక్షన్ ఇస్తుంది. లాభం-నష్టం, ప్రాఫిట్-లాస్ అనేవాటిని బుద్ధి చెప్తుంటుంది. ఏం చేస్తుంది?

ప్రశ్నకర్త : వ్యవహారంలో తిప్పుతుంటుందా?

దాదాశ్రీ : ఔను. వ్యవహారంలోనే తిప్పుతుంటుంది. అది బయటకు పోనివ్వదు. ఎప్పటికీ మోక్షంలోకి పోనివ్వదు. బుద్ధి నాశనం జరిగినపుడు మోక్షం లభిస్తుంది. నేను అబుద్ధుడను. నాకు బుద్ధి లేదు. చిన్న పిల్లలకు కూడా బుద్ధి ఉంటుంది. మనుషులందరికీ బుద్ధి ఉంటుంది. వర్ల్డ్‌లో మనం ఒక్కళ్ళమే బుద్ధి ఉన్నవాళ్ళం కాదు. ఈ వర్ల్డ్‌లో ప్రతి మనిషి అన్ని రకాల జ్ఞానాలను తెలుసుకునివుంటాడు. సైంటిస్ట్ అన్ని రకాల జ్ఞానాలను కలిగివుంటాడు. కాని అది బుద్ధిలోకి వెళ్ళిపోతుంది. ఎందుకంటే అది జ్ఞానం విత్ ఇగోయిజమ్, ఇగోయిజమ్ మీడియంతోనే వచ్చిన జ్ఞానం. ఆత్మజ్ఞానం ప్రకాశం. ఆ డైరెక్ట్

జ్ఞానాన్నే జ్ఞానం అంటారు. ఇగోయిజమ్ లేనిచోట డైరెక్ట్ జ్ఞానం ఉంటుంది. ప్రపంచంలోని అన్ని విషయాలను (సబ్జెక్ట్స్‌ని) తెలుసుకోండి. కానీ అహంకారి జ్ఞానం, బుద్ధి అనిపించు కుంటుంది, నిరహంకార జ్ఞానం, జ్ఞానం అవుతుంది.

ఈ జగత్తంతా ఏమిటి? షార్ట్ సెంటెంస్‌లో చెప్తాను. ఒకటి శుద్ధాత్మ, మరొకటి సంయోగం.

సంయోగంలో ఎన్నో విభాగాలున్నాయి. స్థూల సంయోగం, సూక్ష్మ సంయోగం, వాణీ సంయోగం. నువ్వు ఏకాంతంలో కూర్చునివున్నపుడు మనసు ఏమైనా చెప్తే, అది నీ సూక్ష్మ సంయోగం. ఎవరైనా మనిషి నిన్ను పిలవటానికి వస్తే, అది స్థూల సంయోగం. నీవేమైనా మాట్లాడితే అది వాణీ సంయోగం. సంయోగం ఏదైతే ఉందో అది వియోగ స్వభావం కలది అవుతుంది. నీకు లభించిన సంయోగం వలన నీకు అతనికి చెప్పాల్సిన అవసరం పడదు, 'నువ్వు వెళ్ళిపో లేక కూర్చో' అని. కూర్చోమని చెప్పినా అతను వెళ్ళిపోతాడు. సంయోగ స్వభావమే వియోగ స్వభావం. శుద్ధాత్మకి ఏం చెయ్యవలసిన అవసరం ఉండదు. దాని టైము అయిపోతే అది లేచి వెళ్ళిపోతుంది. సంయోగాన్ని బుద్ధి రెండు రకాలుగా చెప్తుంది, 'ఇది నాకు మంచే జరిగింది, లేక చెడు జరిగింది' అని. అదంతా సంయోగమే. కానీ బుద్ధి దానికి మంచి, చెడు అని పేర్లు పెట్టింది. అందులో జ్ఞాని అబుద్ధగా ఉండిపోతాడు. సంయోగాన్ని సంయోగంగానే తీసుకుంటాడు. అతను సంయోగాన్ని రెండు భాగాలుగా చెయ్యడు. 'మంచి, చెడు' అనే ద్వంద్వం ఉండదు. అబుద్ధ అయినవారికి సంయోగం నష్టం కలిగించదు. బుద్ధి ఉన్నవారికి 'ఇది మంచి, ఇది చెడు' అని ఉంటుంది. అలా చేస్తే అది కష్టాన్ని కలిగిస్తుంది.

బుద్ధి పూర్తిగా ఉన్నప్పటికీ, ఈ జగత్తుని ఎవరు సృష్టించారు అనే అవగాహన రాదు. ఈ కాలం సైంటిఫిక్ వ్యక్తులు అర్థం చేసుకున్నారు, క్రియేషన్‌లో భగవంతుని అవసరం లేదని.

అహంకారానికి సొల్యూషన్

బగ్ (నల్లి) ని చంపే మందు ఉంటుంది కదా దాన్ని తాగేస్తారు వాళ్ళు. ఇక వాళ్ళని చంపేందుకు భగవాన్ అవసరం పడుతుందా?

ప్రశ్నకర్త : కానీ, మందు తాగాలనే బుద్ధిని ఇచ్చేదెవరు?

దాదాశ్రీ : లోపల ఉంటుందే ఆ బుద్ధి.

ప్రశ్నకర్త : అది ఆత్మ.

దాదాశ్రీ : లేదు. ఆత్మ అందులో చెయిపెట్టదు. ఆత్మ నిర్లేపమైనది, అసంగమైనది. ఇదంతా ఇగోయిజమ్ చేసే పని.

ప్రశ్నకర్త : అయితే ఒక మనిషి అలా నల్లుల మందు తాగటానికి, అతని పూర్వజన్మకి ఏమైనా సంబంధం ఉంటుందా?

దాదాశ్రీ : ఔను పూర్వజన్మ సంబంధమే ఉంటుంది. అది అతని కర్మే కాని వేరే ఏమీ లేదు. భగవాన్ ఇందులో చెయ్యే పెట్టడు. కర్మతోనే అతని బుద్ధి అలా అవుతుంది, నల్లుల మందును తాగుతాడు. ఆత్మ అసంగంగానే ఉంటుంది.

ఆత్మ కోరిక వలనే జరిగిందని కొందరు అంటారు. కానీ ఆత్మకి కోరిక అంటూ ఏమీ ఉండదు. ఆత్మకి కోరికంటూ ఉంటే అది బిచ్చగాడు. ఆత్మకి కోరిక కలిగితే అంతా నాశనమే. ఇదంతా ఇగోయిజమ్ పని. మధ్యలో ఉన్నది అహమే. ఇగోయిజమ్ పోయినప్పుడు పజిల్ అంతా సాల్వ్ అయిపోతుంది. పజిల్ సాల్వ్ చేసుకోవాలన్న ఆలోచన ఉందా మీకు? కానీ పజిల్ ఉంటేనే ప్రోగ్రెస్ ఉంటుంది. పజిల్ ఉండాలి. ప్రాబ్లమ్ ఉండాలి. ప్రోగ్రెస్ కోసం ప్రోబ్లమ్ ఉండాలి. మైండ్ పరీక్ష, బుద్ధి పరీక్ష, ఇగోయిజమ్ పరీక్ష ఉండవలసిందే.

'నేను ఇలా అన్నాను' అంటే అతను ఆ స్పీచ్‌కి యజమాని అవుతాడు. అందరూ భ్రాంతిలో, 'నేను ఇలా చేసాను, అలా చేసాను' అంటారు. అదంతా భ్రాంతే కాని, నిజం కాదు. అందులో ఇగోయిజమ్ ఉంటుంది. ఇగోయిజమ్‌తోనే జన్మజన్మాంతరాలు కలుగుతాయి.

లాస్ట్ స్టేషన్ వచ్చే సమయం వచ్చినపుడు, రెండు మూడు రోజులే మిగిలివున్నపుడు ఏమౌతుంది? అతనేమని అంటాడు? 'నేనేమీ మాట్లాడలేను' అంటాడు. మాటలు ఆగిపోతాయి. అప్పుడు మీరు అంటారు, 'నేను మాట్లాడుతాను' అని. అరె, ఏం మాట్లాడుతారు?

వర్ల్డ్ అంతటిలోను ఏ మనిషీ పుట్టలేదు తనకు తానుగా దొడ్డికి వెళ్ళే శక్తి కలిగినవాడు. అది ఆగిపోయినప్పుడు తెలుస్తుంది అది నా శక్తి కాదు అని. రోజంతా ఏమంటూవుంటాడు, 'ఇది నేను అన్నాను, నేను అలా మాట్లాడాను, నేను అలా అనేసాను' అని. మరి చనిపోయేటప్పుడు ఆ మాట్లాడేవాడు ఏమైపోయాడు? అప్పుడు, 'ఏమీ లేదు. అంతా ఆగిపోయింది' అంటారు.

ఇది ఓన్లీ ఇగోయిజమ్ అనే మాట, 'నేను ఇది చేసాను, నేను అది చేసాను' అని. నాలో ఇగోయిజమ్ ఎంతమాత్రం లేదు. ఈ దేహానికి నేను యజమానిని ఎప్పుడూ అవలేదు. ఈ స్పీచ్‌కి, ఈ మైండ్‌కి కూడా యజమానిని కాలేదు. మీరైతే అన్నిటికీ యజమానిగా, 'ఇది నాది, అది నాది' అనుకుంటారు. ఎవరైనా కానీ, లాస్ట్ స్టేషన్‌లో ఏమీ తీసుకునిపోరు. నీదే అయితే వెంట తీసుకుపో మరి? కానీ, తీసుకునిపోరు. అతనికి కోరికయితే ఉంటుంది తీసుకునిపోవాలని. కానీ ఎలా తీసుకునిపోతాడు? రెంటల్ రూమ్‌ని కూడా ఖాళీ చెయ్యాలని అనిపించదు కాని ఏం చేస్తాం? తన్నులు తన్ని బయటకు పంపిస్తారు.

మీరే స్వయంగా భగవంతుడు కానీ మీకు అది తెలియదు. నేను దాన్ని చూస్తాను. కానీ, మీకు ఆ భగవంతుని అనుభవం కలగటం లేదు. మీరు ఆత్మ అనే అనుభవం మీకు కలుగలేదు. సెల్ఫ్ రియలైజేషన్ కూడా చేసుకోలేదు సరికదా, మీ సెల్ఫ్ కానిదాన్ని 'నేనే సెల్ఫ్' అని నమ్ముతున్నారు.

ప్రశ్నకర్త : అహాన్ని మర్చిపోమని అందరూ చెప్తారు, అహాన్ని మర్చిపోవటానికి నేను సిద్ధమే. కానీ, దేన్నయితే మర్చిపోలేమో, దాన్ని మర్చిపోవటం ఎలా?

దాదాశ్రీ : ఏ మనిషైనా అహాన్ని మర్చిపోలేడు.

ప్రశ్నకర్త : మరి దాన్ని వదిలిపెట్టటం ఎలా? దానికోసం ఏం చెయ్యాలి?

దాదాశ్రీ : జ్ఞాని పురుష్ ఎవరైతే ఉంటారో అతని సైంటిఫిక్ విజ్ఞానంతో అదంతా జరుగుతుంది. అక్కడ పనిచేసేది జ్ఞానం కాదు. ఇదంతా జ్ఞానమే. రెలెటివ్ జ్ఞానం. అందులో చెయ్యవలసివస్తుంది. కానీ, ఇది రియల్ జ్ఞానం. దాన్ని విజ్ఞానం అంటారు. విజ్ఞానం లభిస్తే మీకు ఇక ఏమీ చెయ్యవలసిన అవసరం ఉండదు. దానంతటదే జరిగిపోతుంది.

ప్రశ్నకర్త : చాల మంది, నాకు జ్ఞానం వచ్చింది అని చెప్తుంటారు, అదేమిటి?

దాదాశ్రీ : కాదు. అది జ్ఞానం కాదు. జ్ఞానమని అనుకున్నది మెకానికల్ జ్ఞానం. జ్ఞానం వేరు. జ్ఞానాన్ని వర్ణించటంకూడా సాధ్యం కాదు. జ్ఞానంలో ఒక పర్సెంటు కూడా ఈరోజు ఎవరూ చూడలేదు. అవన్నీ మెకానికల్ చేతన గురించిన మాటలే, భౌతికపరమైన మాటలే. భౌతికంలో సూక్ష్మ విభాగమైనది భక్తి విభాగం. అక్కడ 'నేను', 'భగవంతుడు' వేరుగానే ఉంటారు. జగత్తు కోసం ఆ జ్ఞానం సరైనదే. కాని అసలు జ్ఞానమని దేన్ని అంటారు, ఫుల్ జ్ఞానాన్ని. దానికంటే ఎక్కువ తెలుసుకోవలసింది మరేమీ లేనిదాన్ని. దాన్ని 'కేవలజ్ఞానం' అంటారు. అందులో ఎటువంటి క్రియలూ ఉండవు. జగత్తులోని జ్ఞానమంతా క్రియలతో కూడుకున్న జ్ఞానం.

ఈ దేహం ఒన్ లైఫ్ కోసం ఇలాగే నడుస్తుంది. ఇందులో ఆత్మ క్రియ లేకపోతే ఇబ్బంది ఏమీ లేదు. అందులో ఆత్మ హాజరీ అవసరం. 'నేను' 'వాటితో' పాటే ఉన్నాను అంటే అన్ని క్రియలూ జరిగిపోతాయి. ఆ క్రియలన్నీ మెకానికల్. వర్ల్డ్ ఆత్మ అని అనుకునేది ఏదైతే ఉందో అది మెకానికల్ ఆత్మ. నిజమైన ఆత్మ కాదు. నిజమైన ఆత్మని 'జ్ఞాని' చూస్తాడు, జ్ఞాని అందులోనే ఉంటాడు. నిజమైన ఆత్మ స్వయం 'ఖుద్' (తానే). దాన్ని గుర్తించినవాడే ఖుదా (భగవంతుడు).

నిజమైన ఆత్మ అచలం, మెకానికల్ ఆత్మ చంచలం. అందరూ మెకానికల్ ఆత్మని వెతుకుతుంటారు. ఆ మెకానికల్ ఆత్మ కూడా ఇంకా దొరకలేదు. ఇక అచలం మాట ఎక్కడిది? అది 'జ్ఞాని పురుష్' చేసే పని. 'జ్ఞాని పురుష్' ఎక్కడో ఎప్పుడో ఉంటారు. వేలాది సంవత్సరాలలో ఒకటి అరా 'జ్ఞాని పురుష్' వస్తారు. అప్పుడు వాళ్ళ సన్నిధిలో ఆత్మ అంటే ఏమిటో పూర్తిగా అర్థమౌతుంది.

ప్రతి గ్రంథంలో రాసివుంటుంది, ప్రతి మతం చెప్తుంది, ఆత్మని ఎరుగు, అదే చివరిగా చెయ్యవలసింది అని. హిందుస్తాన్‌లో ఇప్పటికీ సంత మహాత్ములున్నారు. వాళ్ళంతా ఆత్మని అన్వేషిస్తుంటారు. కాని ఆత్మని కనుగొన్నవారెవరూ లేరు. ఆత్మ అనేది దొరికే వస్తువు కాదు. ఎవరైతే 'దొరికింది' అని అంటారో వాళ్ళు అలా భ్రాంతిలో అంటారు. ఆత్మ అంటే ఏమిటన్నది వాళ్ళకి తెలియనే తెలియదు. ఆత్మ అంటే స్వయం పరమాత్మే. అది దొరికింది అంటే స్వయంగా పరమాత్మ అయినట్లే. 'ఓ భగవంతుడా నాకు ఇది చెయ్యి, అది చెయ్యి' అని అంటున్నంత వరకు, 'నేను స్వయం భగవాన్‌ని, నేను పరమాత్మని' అనే సాహసమే చెయ్యలేరు. 'నేను-నువ్వు, నేను-నువ్వు' అనేది ఉన్నంత వరకూ మీరు ఏమీ సంపాదించినట్లు కాదు.

ప్రశ్నకర్త : దానికోసం ఏం చెయ్యాలి?

దాదాశ్రీ : ఏం లేదు. దానికోసం ఏమీ చెయ్యనవసరం లేదు. ఏమైనా చెయ్యగల మనిషే లేడు. ఎందుకంటే యు ఆర్ టాప్స్, నువ్వు ఒక బొంగరానివి. నీలో ఏవిధమైన శక్తీ లేదు. నిన్ను ప్రకృతి నడిపిస్తోంది. ఎందుకంటే, 'నువ్వు ఎవరివి' అన్నది నీకు తెలియనే తెలియదు. నీకున్న శక్తి ఎంతటిది? నువ్వు ఏం చేద్దామనుకుంటున్నావు? ప్రకృతిని తెలుసుకున్నవారు, ప్రకృతి ఆధారంగా నడుచుకుంటారు. తనను తాను తెలుసుకోవటం, తన మీద తాను ఆధారపడి నడుచుకోవటం, రెండు వేరువేరు. స్వయం ప్రకాశమైనవారు అంతా చేయగలుగుతారు. పూర్తి వర్ల్డ్‌లోని మనుషులను నేను టాప్స్ అంటాను. నిజం చెప్పాలంటే అందరూ టాప్సే. ప్రకృతి ఆడిస్తుంది, దాని ప్రకారం నువ్వు ఆడుతావు.

కానీ, 'నేను ఆడుతున్నాను' అంటావు. జ్ఞాని పురుష్‌కి 'స్వ', 'పర' రెండూ వేరువేరుగానే ఉంటాయి, వాటి మధ్య లైన్ ఆఫ్ డిమార్కేషన్ ఉంటుంది. 'పర' ప్రకృతి విభాగం, అనాత్మ విభాగం, 'స్వ' తన సొంత విభాగం, ఆత్మ విభాగం. వాళ్ళకి హెూం డిపార్ట్‌మెంటు, ఫారిన్ డిపార్ట్‌మెంటు రెండూ విడిగానే ఉంటాయి. అవసరాన్నిబట్టి ఫారిన్‌లోకి వస్తారు, ప్రకాశ రూపంలో. కానీ ఎప్పుడూ క్రియలు చేయరు. ఆత్మ ఎప్పుడూ క్రియలు చేయలేదు. అది దర్శన క్రియ, జ్ఞానక్రియ మాత్రమే చేస్తుంది. ఈ రెండు క్రియలు మాత్రమే చేస్తుంది. మనకి కనిపించేదంతా, అటువంటి క్రియలు చేసే శక్తే దానికి లేదు. అలా చేసే కోరిక కలిగితే కల్పనామాత్రంతోనే చేయగలుగుతుంది. అంగాల అవసరం ఉండదు. కల్పనతో అంగాలు కలిగినదిగా అవగలుగుతుంది. ఈ కల్పనతోనే జగత్తంతా తయారైంది. ఇక దానికి అన్నీ లభిస్తాయి. తర్వాత దానికి ఇవన్నీ నచ్చవు కనుక, అది మోక్షాన్ని కోరుకుంటుంది, 'హే భగవాన్! నాకు ఇవన్నీ వద్దు! నాకు మోక్షమే కావాలి' అని. భగవానుని కల్పనతోనే జగత్తంతా సృజించబడుతుంది. అంత కల్పనా శక్తి ఉంటుంది!! భగవంతునికి కల్పనా శక్తి ఉంది కానీ మనకున్నటువంటి శక్తి లేదు. ఇగోయిజమ్ లేదు.

ఇగోయిజమ్ ఎందుకు? గొప్పవాళ్ళకి ఇగోయిజమ్ అవసరం ఏముంటుంది? చిన్నవాళ్ళకే ఇగోయిజమ్ ఉంటుంది. పెద్దవాళ్ళు తనకంటే పెద్దవాళ్ళెవరూ లేనివాళ్ళకి ఇగోయిజమ్‌తో పనేముంది? నాకు తెలుసు, 'బ్రహ్మాండంలో నాకంటే పెద్ద ఎవరూ లేరని. అలాంటప్పుడు నాకు ఇగోయిజమ్‌తో ఏం పని?' నేను ఒక చిన్న బాలుడిలా జీవిస్తాను. నన్నెవరైనా తిట్టిపోసినా నేను వాళ్ళని ఆశీర్వదిస్తాను. నాకు తెలుసు పాపం అతనికి అవగాహన, దృష్టి లేవని. అతన్ని నేను నిర్దోషిగా చూస్తాను. వర్ల్డ్‌లో నాకు ఎవరూ దోషులుగా కనపడరు. నాకు అందరి ఆత్మలు కనిపిస్తాయి, ప్రకృతీ కనిపిస్తుంది. ముందు పురుష్ అయ్యి పురుష్‌ని చూడు. ఇక దోషులుగా ఎవరూ కనపడరు. భగవాన్ మహావీర్ కేవలజ్ఞానంలో ఉండేవారు. ఆయనకి అందరూ సమానంగా నిర్దోషులుగా

కనిపించేవారు. ఆయన దృష్టిలో దొంగ దొంగతనం చేస్తాడు, అది కూడా కరెక్టే, దాత దానం చేస్తాడు, అది కూడా కరెక్టే.

అహంకారానికి జడ్జ్‌మెంట్

దాదాశ్రీ : నీలో ఏమైనా తప్పులున్నాయా?

ప్రశ్నకర్త : ఆ. ఉన్నాయి కదా.

దాదాశ్రీ : ఎన్ని? రెండు మూడు ఉంటాయా?

ప్రశ్నకర్త : ఎక్కడెక్కడ తప్పులు చేసాని ఆలోచిస్తే చాల బయటపడతాయి. ఎందుకంటే ఆత్మ 'జడ్జ్‌మెంటు' తప్పవదు.

దాదాశ్రీ : ఇది ఆత్మ 'జడ్జ్‌మెంటు' కాదు. అహంకారం 'జడ్జ్‌మెంటు'. కానీ, అది కూడా సుందరమైన 'జడ్జ్‌మెంటు' చేస్తుంది. అహంకారం కూడా శుద్ధ వస్తువే. దాన్ని ఎంత శుద్ధంగా పెట్టుకోవాలంటే అంత శుద్ధంగా పెట్టుకోవచ్చు. కానీ, అహంకారం మూలగుణం పోదు. అహంకారానికి ఇంటరెస్ట్ అయిన వస్తువుని అది మూసిపెడుతుంది. అక్కడ ఇక న్యాయం చెయ్యదు. అహంకారికి స్వయంగా ఎందులో ఇంటరెస్ట్ ఉంటుందో ఆ వస్తువులలోని లోపాలను చూడదు. అక్కడ లోపాలన్నిటినీ మూసిపెట్టివుంచుతుంది.

ప్రశ్నకర్త : అహంకారాన్ని వీడే మార్గమేమిటి?

దాదాశ్రీ : నేనే వదిలిస్తాను. మీరేం వదులుతారు? మీరు స్వయంగా అహంకారంలో బంధితులైవున్నారు.

ఈ అహంకారానికి ఎంత లెంగ్త్ (పొడవు), ఎంత హైట్ (ఎత్తు), ఎంత బ్రెడ్త్ (వెడల్పు) ఉందో మీకు తెలుసా? ఈ అహంకారం జగత్తంతా వైడ్ స్ప్రెడ్ అయ్యింది (విస్తృతంగా వ్యాపించివుంది). అహంకారం లెంగ్త్, బ్రెడ్త్, హైట్ అన్నీ ఎక్కువే. మరి ఇక అహంకారాన్ని ఎలా తీసేసుకుంటారు? భగవంతుని విశ్వరూపంలాంటిదే అహంకార స్వరూపం కూడా. మీకు అహంకారాన్ని తీసేయాలా? అయితే నేను తీసేస్తాను. నా దగ్గరకు రండి.

అహంకారం వీడిన తర్వాత కూడా ఆ అహంకారం సంతానం ఉంటుంది కదా– క్రోధం, మానం, మాయ, లోభమని. అవన్నీ కూడా పరుపులు సర్దుకుని వెళ్ళిపోతాయి. ఇక దేహంలో ఏమైనా కాస్త మిగిలితే అది జీవింతో ఉండదు. ఇక మీకు క్రోధం రాదు, బాడీకి వస్తుంది. కానీ నిర్జీవమైపోతుంది. నిర్జీవమంటే డ్రామాటిక్, నాటకంలా ఉంటుంది. నాటకంలో అంటారు కదా 'నేను మహారాజుని' అని. కానీ, లోపల మీకు తెలుసు, 'నేను బ్రాహ్మణుడిని కాని ఇక్కడ నాటకంలో మహారాజుని' అని.

నిరహంకారి ప్రపంచాన్ని ఎవరు నడిపిస్తారు?

నాలో అహంకారం పూర్తిగా నశించింది. సైంటిస్ట్‌లు అడుగుతారు, 'మీ అహంకారం పోతే మీరు మీ పనులు ఎలా చేసుకోగలుగుతున్నారు' అని. దానికి నేను చెప్తాను, 'అది నిర్జీవ అహంకారం'. అది ఎలా అంటే, ఈ బొంగరాన్ని చూసారు కదా? దాన్ని ఇలా విసిరేస్తాను, ఇక అది తిరుగుతుంటుంది. అది ఎలా తిరుగుతుంది? అది నిర్జీవి కదా. అలాగే నా అహంకారం కూడా నిర్జీవ అహంకారమే. మీకు సజీవ అహంకారం ఉంది, నిర్జీవ అహంకారమూ ఉంది. నిర్జీవ అహంకారంతో కర్మఫలం లభిస్తుంది, సజీవ అహంకారంతో మరు జన్మకి కర్మబంధం ఏర్పడుతుంది.

సజీవ అహంకారంతో వచ్చే జన్మలో మనోవాక్కాయకర్మలకు కొత్త బ్యాటరీ చార్జ్ జరుగుతుంది. నిర్జీవ అహంకారం వలన మనోవాక్కాయకర్మల పాత బ్యాటరీ డిశ్చార్జ్ అవుతుంది. అలా మీకు చార్జ్, డిశ్చార్జ్ రెండూ అవుతున్నాయి. నేను మీ ఛార్జ్‌ని నిలిపివేస్తాను. ఇక డిశ్చార్జ్ మాత్రమే మిగిలివుంటుంది. కేవలం ప్రపంచాన్ని నడపటానికి ఎంత అహంకారం కావాలో, అంతమాత్రం అహంకారం డిశ్చార్జ్ రూపంలో మిగిలివుంటుంది. ఛార్జ్ రూపంలోని అహంకారం పోతుంది.

ఆత్మ ప్రాప్తి తర్వాత తిట్టండి, ఏమైనా చెయ్యండి కాని అతనికి వాటి స్పర్శ ఉండదు. ఆత్మ ప్రాప్తి తర్వాత ఇగోయిజమ్ వదిలివెళ్ళిపోతుంది. ఆత్మ ప్రాప్తి

తర్వాత ఉండే ఇగోయిజమ్, ప్రాపంచిక వ్యవహారాల వరకే ఉంటుంది, నిర్జీవ ఇగోయిజమ్ అది. ఇక సజీవ ఇగోయిజమ్ ఉండదు.

అహంకారానికి విముక్తి కలిగించాలి. అహంకారానికి విముక్తి మీకు ముక్తి అవుతుంది.

జ్ఞానుల భాషలో జీవించేవారు, మరణించేవారు ఎవరు?

ప్రశ్నకర్త : ఆత్మ అమరం అంటే ఏమిటి దాని అర్థం?

దాదాశ్రీ : అమరం అంటే సనాతనం. రియల్ అయిన వస్తువు సనాతనం. సనాతనమే అమరం. సనాతనం అంటే శాశ్వతం, పర్మనెంట్! ఆత్మ పర్మనెంటు. మీరు పంచేంద్రియాల నుంచి కలిగే అనుభవాలన్నీ రిలెటివ్. అవన్నీ అవస్థలు. అవస్థ అనేది టెంపరరీ అడ్జస్ట్‌మెంటు, వినాశనకారి.

ప్రశ్నకర్త : మరణించేది ఎవరు?

దాదాశ్రీ : స్వయంగా మీరు మరణించరు. ఈ ఇగోయిజమ్ ఉంది కదా అదే మరణించేది. ఎందుకంటే అది 'నేను, నేను' అంటూవుంటుంది. అహంకారం లేనిదే స్వయంగా మీరు. అలా స్వయం అయిన తర్వాత అది చావదు. మరణిస్తాను అనే ఫియర్ (భయం) ఉండేది ఇగోయిజానికే. ఇగోయిజమ్‌తోనే క్షణంలో ఎలివేట్ అవుతారు, క్షణంలో డిప్రెస్ అవుతారు. ఇగోయిజమ్ పోతే ఇక ఎప్పటికీ డిప్రెస్ అవరు.

'ప్రపంచంలో ఎవరూ మరణించరు' అంటారు భగవాన్. కానీ అందరూ ఏడుస్తారు ఎందుకని? వాళ్ళు 'మాకు అలా అనిపించదు కదా' అని అంటారు. అప్పుడు నేను, 'నా కంటితో చూడు, 'జ్ఞాని పురుష్' దృష్టితో చూడు' అంటాను. 'ఈ ప్రపంచంలో ఎవరూ మరణించరు' అన్నది నేను చూసాను. కానీ, 'నా అన్న చనిపోయాడు, నా మేనల్లుడు చనిపోయాడు' అంటూ మనుషులు రోదిస్తుంటారు. అరె, ఎందుకలా ఒట్టిగా బాధపడతారు? కేవలం వాళ్ళ అవస్థ

వినాశనం జరిగింది. మూల వస్తువు సనాతనమైనది. నువ్వు సనాతనమైతే నీకేమీ కాదు. నువ్వు అవస్థ రూపంలో ఉంటే నీ వినాశనం జరుగుతుంది.

ఈ విషయాన్ని అర్థం చేసుకోవటం అవసరం. నేను వైజ్ఞానిక విషయాన్ని చెప్తున్నాను. వైజ్ఞానికమంటే, 'ఉన్నది అలాగే ఉంటుంది', 'లేనిది లేదు' అని చెప్తాను. 'లేనిదాన్ని' నేను 'ఉన్నది' అని చెప్పను. మీరు, 'అలా ఏమైనా అయ్యుండవచ్చు' అని అన్నా, నేను 'లేదు' అనే చెప్తాను. మీకు ఎంత చెడుగా అనిపించినా సరే, 'లేదు' అనే చెప్తాను కాని, 'ఉన్నది' అని చెప్పను. ఎందుకంటే అది నా బాధ్యత. నేను చెప్పే మాట, ఇరవై రెండు సంవత్సరాలుగా నేను చెప్తూవస్తున్నదానిలో మీరు ఏదైనా ఒక మాటయినా మీరు ఇలా అన్నారు అప్పుడు దాని గురించి చెప్పండి అని అంటే, నేను దాని వివరణనివ్వగలుగుతాను. ప్రతి ఒక్క విషయం మీద వివరణనివ్వటానికి నేను తయారుగా ఉన్నాను. ఈ ప్రపంచమే ఒక పజిల్‌గా అయింది. నేను స్వయంగా చూసాను ఏవిధంగా పజిల్‌గా తయారైందో.

ప్రశ్నకర్త : ఇంగ్లీషులో సోల్ అంటారు, అదేనా ఆత్మ అంటే?

దాదాశ్రీ : వాళ్ళు సోల్ అంటారు కానీ, సోల్ అంటే ఏమిటో అర్థం చేసుకోరు. ఆత్మ అనేది వేరు. ఆత్మ ఒక ప్రకాశం. కాని దానికి అలా ఆత్మ అనే పేరు పెట్టారు. ఆత్మ అనే వస్తువు, నాలుగు వేదాలను పఠించినా అందులో ఆత్మ లేదు. అందరూ ఆత్మను అన్వేషిస్తుంటారు. కానీ, ఆత్మ స్థూల వస్తువు కాదు. అది సూక్ష్మ వస్తువూ కాదు. అది సూక్ష్మతరమైనది కూడా కాదు. ఆత్మ సూక్ష్మతమమైనది. పుస్తకం స్థూలం, అందులో పదాలూ స్థూలం. పుస్తకంలో ఉండేదంతా స్థూలమైనదే. సూక్ష్మ, సూక్ష్మతర, సూక్ష్మతమమైనది అందులో లేనేలేదు. మరి ఆత్మని ఎక్కడని వెతుకుతాం? గో టు జ్ఞాని. జ్ఞాని పురుష్ దగ్గరకు పో. అక్కడ అన్నీ లభిస్తాయి.

అహంకారం ధ్యానంలో లేదు, క్రియలో ఉంది

ప్రశ్నకర్త : నేను ధ్యానం సరిగ్గా చేయలేకపోతున్నాను. ధ్యానం ఎలా చెయ్యాలి? నాకు నేర్చుకోవాలని ఉంది.

దాదాశ్రీ : ధ్యానం మీరు చేస్తున్నారా లేక మరెవరైనా చేస్తున్నారా?

ప్రశ్నకర్త : నేను చేస్తాను.

దాదాశ్రీ : ఎప్పుడైనా మీరు ధ్యానం చెయ్యలేకపోవటమనేది జరుగుతుంటుందా?

ప్రశ్నకర్త : ఆ. అలాగే జరుగుతుంటుంది.

దాదాశ్రీ : అందుకు కారణం ఉంది. మీరు 'చందూభాయ్' గా ఉన్నంత కాలం, మీరు ఏ పనినీ సరైన పద్ధతిలో చెయ్యలేరు. 'మీరు చందూభాయ్' అనే విషయం ఎంత శాతం నిజం?

ప్రశ్నకర్త : నూరు శాతం.

దాదాశ్రీ : 'నేను చందూభాయ్‌ని' అనే రాంగ్ బిలీఫ్ ఉన్నంతకాలం, 'నేను ఇది చేసాను, నేను అది చేసాను' అనే అహంకారం ఉంటుంది. ఏ పని చేసినా అందులో కర్తృత్వ అహంకారం ఉంటుంది, కర్తత్వ భావన పెరుగుతూవుంటుంది, భగవంతుడు అంత దూరంగా వెళ్ళిపోతుంటాడు. మీరు పరమాత్మ స్థాయిని చేరుకోవాలంటే, జ్ఞాని దగ్గరి నుంచి జ్ఞానం తీసుకుంటే మీలోని అహంకారం పోతుంది, అప్పుడు మీ పనులు నెరవేరుతాయి.

ధ్యానం చెయ్యటం ఎవరికీ రాదు. ధ్యానం చెయ్యటం వలన వచ్చేదంతా అహంకారంతోనే. అందువలన దాన్ని సరైన ధ్యానం అని అనలేము. దాన్ని ఏకాగ్రత అంటాము. అహంకారం లేనిచోటే ధ్యానం ఉంటుంది. అహంకారికి ధ్యానం కుదరదు. ధ్యానమనేది అర్థం చేసుకోవలసిన విషయమే కాని, చేసేది కాదు. ధ్యానం, ఏకాగ్రతలలో చాలా తేడా ఉంది. ఏకాగ్రత కావాలంటే

అహంకారం అవసరమే. ధ్యానం అనేది అహంకారానికి మించినది. అహంకారం పెరిగినా తరిగినా, అది మీ ధ్యాసలో ఉంటుందా లేదా?

ప్రశ్నకర్త : ఔను.

దాదాశ్రీ : అహంకారం పెరిగినా తరిగినా, దాన్ని ధ్యాసలో పెట్టుకుంటే అది 'ధ్యానం' అవుతుంది. ఆర్తధ్యానం, రౌద్రధ్యానంలో కూడా అహంకారం ఉండదు.

ప్రశ్నకర్త : ధర్మధ్యానంలో అహంకారం ఉంటుందా ఉండదా?

దాదాశ్రీ : అందులో కూడా అహంకారం ఉండదు. ధ్యానంలో అహంకారం ఉండదు. క్రియలో ఉంటుంది అహంకారం.

ప్రశ్నకర్త : ఆర్తధ్యానం, రౌద్రధ్యానాలలో అహంకార నిమిత్తంగా జరుగుతుంది కదా?

దాదాశ్రీ : ఒట్టి నిమిత్తమే కాదు, క్రియ కూడా అహంకారమే. క్రియ అనేది ధ్యానం కాదు. కాని, క్రియ వలన ఉత్పన్నమయ్యే పరిణామం ధ్యానం. ఇక ఉత్పన్నమైన ధ్యానంలో అహంకారం ఉండదు. ఆర్తధ్యానంలో, 'నేను ఆర్తధ్యానం చేస్తున్నాను' అనేది లేకపోతే ఆ ధ్యానంలో అహంకారం ఉండదు. అహంకారం వేరో చోట ఉపయోగపడుతుంది, అప్పుడు ధ్యానం ఉత్పన్నమౌతుంది.

ప్రశ్నకర్త : ధ్యానంలో అహంకారం లేదు, కర్త లేడు, మరి కర్మబంధం ఎలా ఏర్పడుతుంది?

దాదాశ్రీ : ఆర్తధ్యానం అయిన తర్వాత, 'నేను ఆర్తధ్యానం చేసాను' అని అనుకుంటే అక్కడ కర్త అవుతాడు, దానివలనే బంధమే ఏర్పడుతుంది.

ప్రశ్నకర్త : ధ్యేయం నిర్ణయించుకున్న తర్వాత స్వయంగా ధ్యాత అయిపోతాడు, అప్పుడు ధ్యానం ఉత్పన్నమౌతుంది అని మీరు చెప్పారు. అందులో అహంకారం అవసరం లేదా?

దాదాశ్రీ : అందులో అహంకారం ఉండవచ్చు, లేకపోవచ్చు. నిరహంకార ధ్యాత అయినప్పుడు శుక్లధ్యానం ఉత్పన్నమౌతుంది. లేదంటే ధర్మధ్యానం, ఆర్తధ్యానం లేక రౌద్రధ్యానం ఉత్పన్నమౌతాయి.

ప్రశ్నకర్త : అంటే, ధ్యాత స్థితి అహంకారి కాని, లేక నిరహంకారే కాని, దాని పరిణామ స్వరూపంగా ఉత్పన్నమయ్యే ధ్యానంలో అహంకారం ఉండదా?

దాదాశ్రీ : ఔను. పరిణామంలో శుక్లధ్యానం జరిగినప్పుడు మోక్ష ప్రాప్తి జరుగుతుంది.

ప్రశ్నకర్త : ధ్యేయం నిర్ణయించుకున్నపుడు అహంకారం పాత్ర ఉంటుందా?

దాదాశ్రీ : ధ్యేయాన్ని నిశ్చయించేది అహంకారమే. మోక్షాన్నిచ్చే ధ్యేయం, ధ్యాత నిరహంకారిగా ఉంటుంది, అప్పుడు శుక్లధ్యానం జరుగుతుంది.

ప్రశ్నకర్త : ధర్మధ్యాన ధ్యేయంలో సూక్ష్మరూపంలో అహంకారం ఉంటుందా?

దాదాశ్రీ : ఔను ఉంటుంది. అహంకారం లేకుండా ధర్మధ్యానం జరగనే జరగదు.

ప్రశ్నకర్త : ఆర్తధ్యాన, రౌద్రధ్యాన, ధర్మధ్యానాలను *పుద్గల్* (పూరించి, కరిగిపోయే) పరిణితి అనవచ్చా?

దాదాశ్రీ : ఆ. దాన్ని పుద్గల్ *పరిణితి* అనవచ్చు. శుక్లధ్యానమైతే స్వాభావిక పరిణితి అవుతుంది.

ప్రశ్నకర్త : అంటే శుక్లధ్యానం ఆత్మ పరిణితి కదా?

దాదాశ్రీ : ఔను.

ప్రశ్నకర్త : శుక్లధ్యానం జరిగినపుడు అందులో ఏమైనా కర్మలుంటే అవి మంచివే అవుతాయనుకుంటా. అలాగే ధర్మధ్యానంలో దానికంటే కాస్త తక్కువ మంచి కర్మలు ఉండవచ్చు. అది నిజమేనా?

దాదాశ్రీ : శుక్లధ్యానంలో క్రమిక మార్గంలో కర్మలు ఉండనేవుండవు. అక్రమ మార్గంలో ఉంటాయి కనుక అలా జరుగుతుంది. కానీ అందులో స్వయంగా కర్తగా జరగవు. తొలగించబడ్డ భావంతో జరుగుతుంది. ఇది కర్మ పూర్తవకుండానే 'జ్ఞాన' ప్రాప్తి అయింది కాబట్టి.

రాగద్వేషాలను పోగొట్టుకునేందుకు ధ్యానం చేయవద్దు. కేవలం వీతరాగ విజ్ఞానాన్ని తెలుసుకోవాలి.

ఇగోయిజమ్ విలయమయ్యేదెలా?

మీకు టెంపరరీ రిలీఫ్ కావాలా లేక పర్మనెంట్ రిలీఫ్ కావాలా?

ప్రశ్నకర్త : పర్మనెంటు

దాదాశ్రీ : అయితే, 'నేను చందూభాయ్‌ని' అనేది ఎంతవరకు నడుస్తుంది? ఆ నమ్మకం ఎంత టైము వరకు సాగుతుంది? పేరు మీద ఏమిటి భరోసా? దేహం మీద ఏమిటి భరోసా? అసలు నేనెవరు అన్నది అన్వేషించాలి కదా? అది తెలుసుకుంటే ఇక మీరు ఇప్పుడు నడుపుతున్న వ్యాపారం ఇంకా బాగా నడుస్తుంది. ఇప్పుడు వ్యాపారం సరిగ్గా నడవటం లేదు. అలా పాడుచేస్తున్నది ఎవరు? బుద్ధి వ్యాపారాన్ని సరిగ్గానే చేస్తుంది కాని ఇగోయిజమ్ దాన్ని చెడగొడుతుంది. కాకపోతే ఇగోయిజమ్ ఎప్పుడూ నష్టం చేస్తూవుండదు.

ప్రశ్నకర్త : ప్రతి నిమిషం ఇదే అనిపిస్తుంది, ఇగోయిజమ్ నష్టం చేస్తుందని.

దాదాశ్రీ : ఆ. అందుకు నేను ఇగోయిజమ్‌ని తొలగించివేస్తాను. ఇక అప్పుడు నష్టం చేసేది వెళ్ళిపోతుంది. తర్వాత వీక్‌నెస్ అంతా పోతుంది. వీకెనెస్ అంతా ఇగోయిజమే. అందుకే. ఇగోయిజమ్ పోయిందంటే వీక్‌నెస్ పోతుంది. ఇక 'చందూభాయ్ ఎవరు, నువ్వెవరు' అనే వేర్పాటు జరుగుతుంది.

ప్రశ్నకర్త : సెల్ఫ్ రియలైజేషన్‌కి దగ్గరిలోకి పోవాలంటే అహం నష్టం జరగాలి కదా?

దాదాశ్రీ : ఔను. 'నేను, నాది' ఇదంతా పోవాలి. నాలో ఇదంతా పోయింది. ఈ 'పటేల్' ని ఎవరైనా తిట్టినప్పటికీ 'నేను' కు అది టచ్ అవదు. ఎందుకంటే, 'నేను' 'పటేల్' కాదు. 'నేను' 'పటేల్' ని అని నమ్ముతున్నంతవరకు ఇగోయిజమ్ ఉంటుంది.

ప్రశ్నకర్త : ఇగోయిజమ్ పోవటం చాల కష్టం.

దాదాశ్రీ : ఇగోయిజమ్‌ని పెంచుకోవటం కూడా చాల కష్టమైన పనే, ఇగోయిజమ్‌ని పోగొట్టుకోవటం కూడా చాల కష్టమైన పనే. ఒక పేదవాడు ఇగోయిజమ్‌ని పెంచుకోవాలంటే, పెంచుకోలేడు.

ఇగోయిజమ్‌ని పోగొట్టుకునేందుకు ఏం చెయ్యాలంటే, ఇగోయిజమ్‌ని పోగొట్టుకున్న మనిషి ఎవరైనా ఉంటే ఆతని దగ్గరకు పోయి కూర్చోవాలి. అప్పుడు తన ఇగోయిజమ్ కూడా నశించి పోతుంది. వేరే దారంటూ ఏమీ లేదు. ఇగోయిజమ్ లేని మనిషి ప్రపంచంలో ఎప్పుడో ఒకప్పుడు దొరకుతారు. అప్పుడు మీ పని నెరవేర్చుకోండి.

– జై సచ్చిదానంద

శుద్ధాత్మకి ప్రార్థన

హే అంతర్యామీ పరమాత్మా! నీవు నాలో ఉన్నవిధంగానే జీవులందరిలో విరాజమానమై వున్నావు. నీ యొక్క దివ్య స్వరూపమే నా నిజ స్వరూపము. నా నిజ స్వరూపము పవిత్ర ఆత్మ.

హే శుద్దాత్మ భగవాన్! నేను నీకు అభేదభావముతో అత్యంతభక్తి పూర్వకంగా నమస్కరించుచున్నాను.

అజ్ఞానవశాత్తు నేను చేసిన తప్పులనన్నింటిని ❖ నీ ముందు ఒప్పుకొనుచున్నాను. నేను ఈ తప్పులకు పశ్చాత్తాపం చెందుతూ నీ క్షమకై అర్థిస్తున్నాను. ప్రభూ! దయతో నన్ను క్షమించు, నన్ను క్షమించు, నన్ను క్షమించు. ఆ తప్పులను మరల చేయకుండునట్లు నాకు శక్తిని ప్రసాదించు.

హే శుద్దాత్మ భగవాన్! మాకు నీతోగల భేద భావము తొలగిపోయి మేమందరము నీతో అభేదతను పొందునట్లు ఆశీర్వదించు. మేము సదా నీతో అభేదతతో తన్మయాకారతను చెందెదము గాక!

(❖ గతంలో నీవు చేసిన తప్పులను గుర్తు తెచ్చుకోవాలి)

ప్రతిక్రమణ : దివ్యమైన క్షమాపణా విధానము

నేను దాదా భగవాన్ సాక్షిగా ❖...................... యొక్క మనోవచన కాయము కంటె పూర్తిగా వేరైన పవిత్రాత్మకు నమస్కరించుచున్నాను.

నేను నా తప్పులను జ్ఞప్తికి తెచ్చుకొన్నాను (ఆలోచన) ❖❖

ఆ తప్పులకై నేను క్షమాపణ కోరుచున్నాను (ప్రతిక్రమణ)

ఆ తప్పులను మరల చేయనని దృఢముగా నిశ్చయించుకొనుచున్నాను (ప్రత్యాఖ్యాన్)

ప్రియాతి ప్రియమైన దాదాభగవాన్! ఈ దృఢ నిశ్చయమును పాలించు శక్తిని నాకు అనుగ్రహించు.

❖ మీ వలన గాయపడిన వ్యక్తి పేరు

❖❖ ఆ వ్యక్తిపట్ల మీరు ఒనర్చిన దోషాలను గుర్తుచేసుకోవాలి.

తెలుగులో దాదా భగవాన్ పుస్తకాలు

1.	అన్ని చోట్లా సర్దుబాటు
2.	విభేదాలను తొలగించడానికి
3.	ఎలాగైనా జస్టిస్ జరిగింది
4.	బాధితుడు తప్పిదము
5.	క్రోధం
6.	చింత
7.	నేను ఎవరు?
8.	భావనతో మెరుగుపడతాయి జన్మ-జన్మలు
9.	మృత్యు సమయం దానికి ముందు, దాని తర్వాత...
10.	ఆత్మ సాక్షాత్కారం
11.	మానవ ధర్మం
12.	సేవ, పరోపకారం
13.	ప్రతిక్రమణ
14.	భార్యాభర్తల దివ్య వ్యవహారం
15.	అంతఃకరణ స్వరూపం


❖ తెలుగులో మరిన్ని పుస్తకాలు జోడించబడుతున్నాయి మరియు త్వరలో అందుబాటులోకి వస్తాయి.

❖ Dada Bhagwan books are available in different languages: Gujarati, Hindi, English, Marathi, Telugu, Kannada, Oriya, Malayalam, Bengali, Punjabi, Assamese, Tamil, German, Spanish, Russian, etc.

❖ 'Dadavani' Magazine is published every month in three languages: Gujarati, Hindi & English.

❖ All Dada Bhagwan books and magazines are also available on online book store : https://store.dadabhagwan.org

దాదా భగవాన్ ఫౌండేషన్ తెలుగు యూట్యూబ్ ఛానల్



❖ ఇది అడాలజ్ దాదా భగవాన్ ఫౌండేషన్ యొక్క అధికారిక తెలుగు యూట్యూబ్ ఛానెల్.

❖ దిగువ లింక్ నుండి తెలుగు భాషలో సత్సంగ వీడియోలను చూడండి.

‘Dada Bhagwan Foundation Telugu’ Channel:

https://dbf.adalaj.org/yttelugu

Open Link OR

Scan QR

YouTube

Dada Bhagwan Foundation Youtube video channels are available in other regional languages: Gujarati, Hindi, Marathi, Bengali, Tamil, Telugu, Kannada, Malayalam, Spanish, Portuguese, etc.

Persons to Contact

Dada Bhagwan Foundation

Adalaj : **Trimandir**, Simandhar City, Ahmedabad-Kalol Highway
P/O: Adalaj, Dist. Gandhinagar - 382421, Gujarat, India.
Tel: +91-9328661166 / 9328661177
E-mail : info@dadabhagwan.org

Mumbai : **Trimandir**, Rushivan, Kajupada, Borivali (E)
Tel: +91-9323528901

Kolkata:	9830093230	**Delhi:**	9810098564
Jaipur:	9351408285	**Chennai:**	7200740000
Bhopal:	9425024405	**Patna:**	7352723132
Indore:	9039936173	**Amravati:**	9422915064
Raipur:	9329644433	**Bangalore:**	9590979099
Chandigarh:	9780732237	**Hyderabad:**	9885058771
Kanpur:	9452525981	**Pune:**	9422660497
Bhubaneswar:	8763073111	**Jalandhar**:	9814063043
Varanasi:	9795228541	**Sangli:**	9423870798

USA: Dada Bhagwan Vignan Institute Tel: + 1-877-505-DADA (3232) Email: info@us.dadabhagwan.org	**U.K: Dada Darshan (UK)** Tel: +44 330-111-DADA (3232) Email: info@uk.dadabhagwan.org
Germany : +49 700 32327474 **UAE** : +97 1557316937 **Kenya** : +25 4722722063 **Dubai** : +971 501364530	**Australia** : +61 421127947 **Singapore** : +65 81129229 **New Zealand** : +64 210376434

Website : www.dadabhagwan.org



అంత:కరణ స్వరూపం

'జ్ఞాని పురుష్' ని వర్ల్డ్ అబ్జర్వేటరీ అంటారు. బ్రహ్మాండంలో జరుగుతున్నదంతా 'జ్ఞాని పురుష్' కి తెలుసు. వేదాలను మించిన విషయాలను 'జ్ఞాని పురుష్' చెప్పగలుగుతారు.

మీరేమైనా అడగండి నాకు తప్పనిపించదు. ప్రపంచమంతటిలోని సైంటిస్ట్‌లు అడిగే మైండ్ (మనస్సు) అంటే ఏమిటి, అది ఎలా పుడుతుంది, అది ఎలా అంతమౌతుంది, అనే జ్ఞానాన్ని నేను ఇస్తాను. మైండ్, బుద్ధి, చిత్తం, ఇగోయిజమ్, అలా అన్ని విషయాలకి సంబంధించిన పూర్తి సైన్స్‌ని ప్రపంచానికి ఇవ్వటానికే నేను వచ్చాను.

–దాదాశ్రీ

9 789391 375669
Printed in India
Price ₹35